PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 200 | విజయవాడ, మంగళవారం 21 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 21 February 2023 | Rs

'దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించండి'

- అదానీ-మోడీ సర్కారుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

లోపలి పేజీలో..



మళ్లీ మెరిసిన మంధాన

- సెమీస్‌కు అమ్మాయిలు
- ఐర్లాండ్‌పై ఐదుపరుగుల తేడాతో గెలుపు

ఆటలు పేజీలో..



సదస్సులో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


నిండా ముంచుతున్న అదానీ

- మోడీ వల్లే ప్రపంచ కుబేరుడైన వైనం
- నోరుమెదపని వైసిపి, టిడిపి, జనసేన
- రాష్ట్రాన్ని అదానీపాలు చేస్తున్న జగన్
- సిపిఎం సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావి బ్యూరో

ఆశ్రిత పెట్టుబడికి పరాకాష్ట అదానీ కుంభకోణమని సిపిఎం నిర్వహించిన సదస్సులో వక్తలు అన్నారు. నరేంద్రమోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత ఆర్థిక వ్యవస్థను అదానీ హైజాక్ చేశారని విమర్శించారు. దేశంలోని సహజ వనరులను మోడీ దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'అదానీ కుంభకోణం-ప్రజల సంపదకు ముప్పు' అనే అంశంపై సదస్సు సోమవారం జరిగింది. విజయవాడలోని బాలోత్సవ భవనంలో జరిగిన కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డొల్ల కంపెనీలతో షేర్ మార్కెట్‌ను అదానీ రిగ్గింగ్ చేశారని విమర్శించారు. అదానీ ఆస్తులు తక్కువ కాలంలో అసాధారణంగా ఎలా పెరిగాయని ప్రశ్నించారు. భారతదేశంలో డొల్ల కంపెనీల ద్వారా పైకి వస్తున్నారని అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట దెబ్బతిందన్నారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు దేశ ప్రతిష్టను దెబ్బకొట్టేందుకు కుట్రచేశారని హిండెన్‌బర్గ్ నివేదికపై అదానీ జాతీయవాదం పేరుతో రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అదానీ తప్పుడు పనులకు కేంద్రప్రభుత్వం కొమ్ముకాస్తుందన్నారు. దేశప్రతిష్టను మంటగలిపి, ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బకొట్టారని, మధ్యతరగతి మదుపుదారుల షేర్లను నష్టపరిచారని తెలిపారు. రాష్ట్రాన్ని కూడా తన గుప్పెట్లోకి తీసుకునేందుకు అదానీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే అదానీతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. చట్టాలు లేకుండా కేవలం ఎంఒయులతో ఇంతపెద్ద మొత్తంలో భూమిని అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై టిడిపి, జనసేన కనీసం నోరు విప్పడం లేదన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచ కార్పొరేట్ చరిత్రలో అదానీది అతిపెద్ద కుంభకోణమని తెలిపారు. షేర్ మార్కెట్‌లో రూ.5.60 లక్షల కోట్లు ఆవిరైనట్లు చెప్పారు. హిండెన్‌బర్గ్ బయటపెట్టిన నివేదికను జాతీయ వాదంతో రెచ్చగొట్టేందుకు మిగతా 5లో



ఉక్రెయిన్‌లో బైడెన్ ఆకస్మిక పర్యటన

- కొత్తగా 50 కోట్ల డాలర్ల సైనిక సాయం

కీవ్ : ఉక్రెయిన్ యుద్ధానికి ప్రజాధనాన్ని పెద్దయెత్తున ఖర్చు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వాషింగ్టన్‌లో ఒకవైపు నిరసనలు హోరెత్తుతుండగా మరో వైపు ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌లో ఆకస్మికంగా పర్యటించారు. పశ్చిమ దేశాలకు నమ్మిన బంటుగా ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్స్కీతో బైడెన్ కీవ్‌లోని అధ్యక్ష భవనంలో సోమవారం రహస్యంగా మంతనాలు జరిపారు. అనంతరం బైడెన్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌కు కొత్తగా 50 కోట్ల డాలర్ల (రూ.4,000 కోట్లు) సైనిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభమై ఏడాది కావస్తున్న తరుణంలో బైడెన్ పర్యటన ఆసక్తికరంగా మారింది. రష్యాతో యుద్ధం కొనసాగించేందుకు తమకు మరిన్ని ఆయుధాలు కావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు ఇటీవల పశ్చిమ దేశాలను కోరారు. ఇప్పటికే అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు రుణ సాయంగా పెద్దయెత్తున ఆయుధాలు సరఫరా చేశాయి. బైడెన్ పర్యటన సందర్భంగా సోమవారం కీవ్ అంతటా వైమానిక దాడుల సైరన్‌ను మోగించారు. ఉక్రెయిన్ అధ్యక్ష భవనం 'మారియిన్‌స్కీ ప్యాలెస్'లో వద్ద బైడెన్ మాట్లాడుతూ 'యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా మద్దతు గురించి ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని అన్నారు. యుద్ధం ప్రారంభమై సంవత్సరం తరువాత కూడా ఉక్రెయిన్ నిలబడిందని, 'ఉక్రెయిన్ నిలబడ్డంతో ప్రజాస్వామ్యం నిలబడిందని అన్నారు. వాషింగ్టన్‌కు సమీపంలోని జాయింట్ బేస్ ఆండ్రూస్ నుంచి ఆదివారం ఉదయం 4:15 గంటలకు బైడెన్ బయలుదేరారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో మృత్యుఘోష

గిరిజన విద్యార్థులకు సకాలంలో అందని వైద్యం

ఆరోగ్య కార్యకర్తల తొలగింపుతో సమస్య జటిలం

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), గుమ్మలక్ష్మీపురం (పార్వపురం మన్యం జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మృత్యుఘోష వినిపిస్తోంది. ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆరోగ్య కార్యకర్తలను తొలగించిన ఫలితంగా సమస్య జటిలమైంది. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబాన్ని విడిచిపెట్టి ఆశ్రమాల్లో విద్యాభ్యాసం కోసం వస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారని, సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్లలో గత నవంబర్ నుంచి ఇప్పటివరకు తొమ్మిది మంది అనారోగ్యంతో మృతి చెందారు. రంపచోడవరం డివిజన్ దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.యమునశ్రీ ఈ నెల 16న, ఇదే పాఠశాల పదో తరగతి విద్యార్థిని కానెం ఈశ్వరిదేవి ఈ నెల తొమ్మిదిన అనారోగ్యంతో మృతి చెందారు. పాడేరు డివిజన్ జి.మాడుగుల మండలం బంధవీధి ఆశ్రమ బాలికల పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని కొర్ర కవిత ఈ నెల 17న, పాడేరు గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థిని హారిక గత నవంబర్‌లోనూ మరణించారు. పాడేరు నెంబర్ వన్ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి పాంగి నవీన్, జి.మాడుగుల గురుకుల పాఠశాల విద్యార్థి కొండబాబు, పాడేరులోని తలారిసింగి సిఎహెచ్ స్కూలు విద్యార్థి ఒకరు అనారోగ్యానికి గురై మృతి చెందారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో గత 15 రోజుల్లో ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. వారిలో సీతంపేట మండలం పూతికవలస గిరిజన బాలికల వసతి గృహ పదో తరగతి విద్యార్థిని కొండగొర్రి పవిత్ర, కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని సుమిత్ర, మక్కువ కెజిబివి పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని కొండగొర్రి యోగీశ్వరి ఉన్నారు. ఇవన్నీ రికార్డుల్లోకి ఎక్కిన మరణాలు. రికార్డులు ఎక్కని మరణాలు ఇంతకంటే ఎక్కువ ఉండొచ్చని గిరిజనులు అంటున్నారు.



ఈశ్వరిదేవి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

అన్నిచోట్లా అనారోగ్య పరిస్థితులు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉంటున్నారు. వాటిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలను ప్రభుత్వం తొలగించింది. అప్పటి నుంచి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు క్షీణించాయి. ఆశ్రమాల్లో మౌలిక సౌకర్యాల కొరతతోపాటు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు మలేరియా, టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. సకాలంలో వైద్యం మిగతా 2లో

గన్నవరంలో తీవ్ర ఉద్రిక్తత

- టిడిపి కార్యాలయంపై వైసిపి దాడి
- కారుకు నిప్పు
- మరో రెండు కార్లు, ఫర్నిచర్ ధ్వంసం
- టిడిపి అధికార ప్రతినిధి పట్టాభి అరెస్టు



వైసిపి వారు తగలబెట్టడంతో టిడిపి కార్యాలయం వద్ద దగ్ధమవుతున్న కారు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై ఎంఎల్‌ఎ వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. కార్యాలయ ప్రాంగణంలోని వాహనానికి నిప్పు పెట్టారు. మరో రెండు వాహనాలను, కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. టిడిపి ఫ్లెక్సీలను చించివేశారు. రాళ్ల దాడిలో గన్నవరం సిఐకు, ప్రజాశక్తి విలేకరికి గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటన గన్నవరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. గన్నవరం ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీమోహన్ అనుచరులు తనపై మారణాయుధాలతో దాడికి ప్రయత్నించారంటూ, తాను ఇంట్లోలేని సమయంలో తన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా సోమవారం ఉదయం గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని అడిగేందుకు టిడిపి నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు ఆయన వెళ్లారు. ఈ నేపథ్యంలో చిన్నాకు మద్దతు తెలిపేందుకు పట్టాభిరామ్ గన్నవరం వచ్చారని తెలుసుకున్న వంశీ అనుచరులు రెచ్చిపోయారు. గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి చేశారు. కార్యాలయంలోని కంప్యూటర్, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఓ టిడిపి నేతకు చెందిన కారును పెట్రోలు పోసి తగులబెట్టారు. మరో రెండు మిగతా 5లో

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- సామాజిక న్యాయానికి పెద్దపీట : సజ్జల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న 18 ఎమ్మెల్సీ స్థానాలకు వైసిపి అభ్యర్థులను ప్రకటించింది. ఎమ్మెల్యే కోటాలో ఏడు, స్థానిక సంస్థల కోటాలో తొమ్మిది, గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను వైసిపి ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసి మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన వారికే ఎక్కువగా కేటాయించి సామాజిక న్యాయం పాటించామని తెలిపారు. 2014 నుంచి 19 మధ్య టిడిపి హయాంలో కేవలం 37 శాతం మందికి ఎమ్మెల్సీ పదవులను ఇస్తే, తమ పార్టీ 68 శాతం మందికి ఇచ్చి బిసిల బ్యాక్‌బోన్ అన్న వైసిపి విధానాన్ని రుజువు చేసిందని తెలిపారు. టిడిపి హయాంలో అవకాశం ఉండి బిసిలకు ప్రాధాన్యతను ఇవ్వలేక పోయిందని విమర్శించారు. జగన్ మాత్రం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు శాసనమండలిలో పెద్దపీట వేశారని తెలిపారు.

జాబితా.. స్థానిక సంస్థల నుంచి

1 నర్తు రామారావు (శ్రీకాకుళం)
2 కుడుపూడి సూర్యనారాయణ (తూర్పు గోదావరి)
3 వంకా రవీంద్రనాథ్ (పశ్చిమ గోదావరి)
4 కవురు శ్రీనివాస్ (పశ్చిమ గోదావరి)
5 మేరుగ మురళీధర్ (నెల్లూరు)
6 డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం (చిత్తూరు)
7 పి రామసుబ్బారెడ్డి (కడప)
8 డాక్టర్ ఎ మధుసూదన్‌రావు (కర్నూలు)
9 ఎస్ మంగమ్మ (అనంతపురం)

ఎమ్మెల్యే కోటా

1 పెనుమత్స వివి సూర్యనారాయణరాజు (విజయనగరం)
2 పోతుల సునీత (ప్రకాశం)
3 కోలా గురువులు (విశాఖపట్నం)
4 బొమ్మి ఇజ్రాయిల్ (తూర్పుగోదావరి)
5 జయమంగళ వెంకటరమణ (పశ్చిమ గోదావరి)
6 చంద్రగిరి యేసు రత్నం (గుంటూరు)
7 మర్రి రాజశేఖర్ (గుంటూరు)ను ప్రకటించారు.

గవర్నరు కోటా :

1 కుంభా రవి (అల్లూరి సీతారామరాజు)
2 కర్రి పద్మశ్రీ (కాకినాడ)ను ప్రకటించారు.

పార్టీ మారుతున్నట్లు గాలి వార్తలు

- ఖండించిన గఫూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ఖండించారు. వైసిపిలో చేరితే ఎమ్మెల్సీ పదవి ఇస్తున్నారని ఒక ఛానల్‌లో స్క్రోలింగ్ ఇచ్చారని, ఇవి గాలి వార్తలు, నిరాధార వార్తలు అని ఖండించారు. సోమవారం తనను కలిసిన మీడియాతో గఫూర్ మాట్లాడారు. తను సిపిఎంలోనే కొనసాగుతున్నానని, కేంద్ర కమిటీ సభ్యునిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇలాంటి వార్తలు సృష్టించడం తగదన్నారు. 50 ఏళ్ల నుంచి సిపిఎంలోనే ఉన్నానని, ఎమ్మెల్సీ పదవి కోసం పార్టీ మారడం తనకు అవమానం అని తెలిపారు. తను ఎవరినీ కలవలేదని, తననూ ఎవరూ కలవలేదని చెప్పారు.

న్యాయం చేయాలని


తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కడప అర్బన్

తమకు న్యాయం చేయాలంటూ తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కడప జిల్లా ఎస్‌పి కార్యాలయ ఆవరణంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు..గండికోట ముంపు వాసులైన కొండాపురం మండలంలోని సుగుమంచిపల్లెకి చెందిన మేరీ కుటుంబానికి మండలంలోని బుక్కపట్నం గ్రామంలోని ఆర్అండ్ఆర్ సెంటర్ పరిధిలో సి బ్లాక్‌లో ప్రభుత్వం భూమి కేటాయించింది. ఈ స్థలాన్ని చూసేందుకు ఈ నెల 12న వారు అక్కడి వెళ్లారు. అదే సమయంలో ఈ స్థలం తమదని, మళ్లీ ఇటువైపు రావొద్దని హోమ్‌గార్డు తిరుపాల్, మరో ఇద్దరు వారిని బెదిరించారు. తమ స్థలం తమకు ఇప్పించాలని కోరుతూ మేరీ కుటుంబసభ్యులు ఎస్‌పి కార్యాలయానికి వచ్చారు. తమకు న్యాయం చేయాలని మేరీ, ఆమె కుమారుడు చిన్నబాలయ్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు, సిబ్బంది వెంటనే వారిని అడ్డుకున్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు వారిద్దరినీ రిమ్స్‌కు తరలించారు. బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు.

ఎన్‌పిఎస్ నిధులు వెనక్కివ్వం

- రాష్ట్రాలకు తెగేసి చెప్పిన నిర్మలా సీతారామన్



జైపూర్ : జాతీయ పింఛను విధానం (ఎన్‌పిఎస్) నిధుల విషయంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఎన్‌పిఎస్ కింద జమయిన చందాల సొమ్మును తిరిగి రాష్ట్రాలకు ఇచ్చేది లేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఎన్‌పిఎస్ నిధులను ఇవ్వాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యల నేపథ్యంలో నిర్మలా ఈ మేరకు ప్రకటన చేశారు. రాజస్థాన్ వేదికగా పలు రంగాల వాటాదారులతో జరిగిన బడ్జెట్ అనంతర చర్చల్లో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. "జాతీయ పింఛను విధానం కింద ఉద్యోగుల ఇపిఎఫ్‌వో నుంచి జమయిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగివ్వాలని రాష్ట్రాలు చెబుతున్నాయి. ఇలాంటి అంచనాలేమైనా రాష్ట్రాలకు ఉంటే.. అది సాధ్యపడదని చెబుతున్నా. ఆ డబ్బుపై అధికారం ఉద్యోగులదే. ఆ డబ్బులకు వడ్డీ వస్తుంది. పదవీ విరమణ తర్వాతే ఆ డబ్బు ఉద్యోగుల చేతికి వస్తుంది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వాల చేతికి ఇవ్వడం కుదరని పని" అని మీడియాకు తెలిపారు. దీనిపై ఆర్థికశాఖ కార్యదర్శి వివేక్ జోషీ కూడా మాట్లాడారు. కొన్ని రాష్ట్రాలు పాత పింఛను విధానాన్ని అమలు చేయడం, కేంద్రం కూడా అదే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. "ఎన్‌పిఎస్ నిధుల్లో తమ వాటా సొమ్మును వెనక్కి ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రస్తుతమున్న చట్టపరమైన నిబంధనల ప్రకారం ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం కుదరదు" అని తేల్చిచెప్పారు. జాతీయ పింఛను విధానం లేదా పాత పింఛను విధానంలో దేన్ని ఎంచుకోవాలనేది రాష్ట్రాల పరిధిలోని అంశమని కేంద్రం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించిన విషయం విదితమే. జాతీయ పింఛను విధానాన్ని దేశంలో కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాయి. పంజాబ్ కూడా ఇదే బాటలో నడిచేందుకు సిద్ధమైంది.

నిధులివ్వకుంటే సుప్రీంకు వెళ్తాం : రాజస్థాన్ సిఎం

అదానీ గ్రూప్ షేర్లు భారీగా పతనమైన నేపథ్యంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్‌పిఎస్ నిధులను కేంద్రం షేర్ మార్కెట్లలో పెట్టి.. ఉద్యోగులను గాలికి వదిలేయడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌పిఎస్ నిధులను తిరిగివ్వాలని, లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఆర్థికమంత్రి స్పందించారు.

ఎన్‌హెచ్‌ఎంకు బడ్జెట్లో నిధులు పెంచాలి

- కలెక్టరేట్ వద్ద 'ఆశా'ల ధర్నా

లోపలి పేజీలో..

బెంగాల్ ఉద్యోగుల 48 గంటల పెన్‌డౌన్

- డిఎ పెంచాలని రాష్ట్రవ్యాప్త నిరసన ప్రారంభం

లోపలి పేజీలో..



పరిశ్రమలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

స్టార్టప్స్‌ను ప్రోత్సహించాలి

- పరిశ్రమలశాఖ సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమలకు సంబంధించి రాష్ట్రంలో స్టార్టప్ కాన్సెప్ట్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. స్టార్టప్‌ల కోసం విశాఖపట్నంలో మూడు లక్షల చదరపు అడుగులతో కొత్త భవనాన్ని నిర్మించాలన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ స్పెషల్ సిఎస్ కరికాల వలవెన్, ఆర్థికశాఖ కార్యదర్శులు కెవివి సత్యనారాయణ, గుల్జార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన మొదలు మార్కెటింగ్ వరకు పరిశ్రమల చేయి పట్టుకుని నడిపించేలా రాష్ట్ర ప్రభుత్వ విధానం ఉండాలని తెలిపారు. న్యూ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో మార్కెటింగ్ టై అప్ విధానంపై దృష్టి సారించాలన్నారు. అంతర్జాతీయంగా మార్కెటింగ్ టైఅప్ చేయగలిగితే ఎంఎస్‌ఎంఇ రంగంలో మరింత మెరుగైన అభివృద్ధి సాధించగలుగుతామన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం మౌలిక సదుపాయాలు కల్పన దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు.

విభజన గాయానికి తొమ్మిదేళ్లు

- బిజెపి ద్రోహాన్ని ఎండగట్టాలి
- త్వరలో అసెంబ్లీ ముట్టడి
- ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి



సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, ఫొటోలో చలసాని శ్రీనివాస్, డి శంకర్ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన గాయానికి తొమ్మిదేళ్లు గడిచిందని ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను, రాష్ట్రానికి ఇస్తానన్న హోదాను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. బిజెపి రాష్ట్రానికి చేసిన విద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎపి రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొంది సోమవారంతో తొమిదేళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పిందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అబద్ధాలు ఆడుతూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చిలో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహించబోతుందని, ఇందులో పారిశ్రామిక వేత్తలకు ఏం చెప్పి పెట్టుబడులు తీసుకొస్తారని ప్రశ్నించారు. హోదా ఉంటే పరిశ్రమలు వస్తాయని, తద్వారా యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. హోదాపై వైసిపి, టిడిపి, జనసేన మాట్లాడటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సహకరించాలని తమ అధినేత చెప్పారని వైసిపి ఎంపి భరత్ పార్లమెంటులో చెప్పారని తెలిపారు. తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మోడీ-జగన్‌ది క్విడ్‌ప్రోకో అని, ఈ రాజకీయాలు చెల్లవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ నరసింహారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మోడీని ఎదిరించే దమ్ము జగన్, చంద్రబాబుకు లేదన్నారు. మోడీకి వత్తాసు పలుకుతూ అంటకాగుతున్నారని విమర్శించారు. హోదా పదేళ్లు ఇస్తానన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నోరు మెదపడం లేదన్నారు. సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రం మెడలు వంచి హోదా తీసుకొస్తానని జగన్ ప్రగల్భాలు పలికారని తెలిపారు. హోదా కోసం యాత్ర చేస్తున్న విద్యార్థులను వేధించే బదులు ఢిల్లీలో తిరగబడాలని జగన్‌కు సూచించారు. బిజెపికి వ్యతిరేకంగా మరోసారి కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు. తాము దక్షిణ భారతదేశంలో 100 సీట్ల వరకు ప్రభావం చూపుతామన్నారు. ఎఐవైఎఫ్ అధ్యక్షులు పి రాజేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. తాము చేపట్టిన బస్సుయాత్రకు విద్యార్థులు పెద్దఎత్తులో మద్దతు తెలిపారని చెప్పారు. హోదా వస్తేనే తమకు ఉపాధి ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారని పేర్కొన్నారు. హోదా అంశంపై మార్చిలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర నాయకులు డి కాశీనాథ్, సాధన సమితి విజయవాడ కన్వీనర్ డి శంకర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్, ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను వేధిస్తున్న అటవీ అధికారులు

- పులి చర్మం, గోళ్ల కోసం సోదాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం అటవీ ప్రాంతంలో పులిని చంపారనే ఆరోపణలతో గిరిజనులపై అటవీశాఖాధికారులు వేధింపులకు పాల్పడుతున్నారు. విచారణ పేరుతో వారిని స్టేషన్‌కు తరలించారు. పులి చర్మం ఎక్కడ? గోళ్లు ఎక్కడ దాచి పెట్టారో చెప్పాలంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. అనుమానం వచ్చిన గిరిజనుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఎవరో చెప్పిన గాలి వార్తలు విని తమని ఇబ్బంది పెట్టడం సరికాదని గిరిజనులు వాపోతున్నారు.

ఎలాంటి ఆధారాలూ లేవు

డి.రామ్మోహన్‌రావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్, పుల్లలచెరువు

అక్కపాలెం ప్రాంతంలో పులి సంచరించిందని తెలియడంతో దాని ఆచూకీ తెలుసుకునేందుకు అటవీ శాఖ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశాం. సమీప గ్రామాలకు రాత్రి వేళ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ఆరు బయట ప్రజలు నిద్రపోవద్దని చాటింపు వేయించాం. విద్యుత్ కంచె తగిలి పులి మృత్యువాత పడినట్లు తెలియడంతో విచారణ చేపట్టాం. ఈ విషయాలు మొత్తం ఉన్నతాధికారులకు తెలియజేశాం. పులిని చంపారనడంలో ఎలాంటి ఆధారాలూ దొరకలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-అమడగూరు (శ్రీసత్యసాయి జిల్లా)

అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు... ఆలదపల్లి గ్రామానికి చెందిన తిరుప్పన్న(40)కు 2.50 ఎకరాల పొలం ఉంది. ఇందులో నాలుగు బోరు బావులను వేయించారు. అయినా చుక్కనీరు పడలేదు. దీనికి తోడు ఆయన కుమారుడికి గుండెకు సంబంధించి శస్త్ర చికిత్సలు చేయించారు. బోరుబావులు, కుమారుడి వైద్య చికిత్సలకు దాదాపు రూ. ఎనిమిది లక్షల వరకు అప్పులు చేశారు. అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టిడిపిలో చేరికపై ఆలపాటితో 'కన్నా' చర్చలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 23న టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధమైంది. పార్టీ ఐదు జిల్లాల ప్రాంతీయ సమావేశంలో ఆయన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సోమవారం గుంటూరులోని కన్నా లక్ష్మీనారాయణ నివాసానికి చేరుకుని ఆయనతో కొద్ది సేపు భేటీ అయ్యారు. కన్నాను పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చినట్టు ఆలపాటి తెలిపారు. కన్నా వంటి సీనియర్ నాయకులు పార్టీలోకి రావడం ముదావాహమని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో మృత్యుఘోష

(మొదటి పేజీ తరువాయి)

అందక కొందరు మృతి చెందుతున్నారు.

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇటీవల పెరుగుతున్న విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. ఆశ్రమాల్లో విద్యార్థులకు భద్రత కొరవడింది. వారి ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు. మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరపాల్సి ఉన్నా, జరపడం లేదు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి.

-కిల్లో సురేంద్ర, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలి

2001 నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలను కరోనా కాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. ఆశ్రమాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా వెంటనే వీరందరినీ విధుల్లోకి తీసుకోవాలి.

-వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి

చాలీచాలని మెస్‌ఛార్జీలతో పోషకాహార సమస్య

ఆశ్రమాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం తక్షణమే స్పందించి మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలి. చాలీచాలని మెస్‌ఛార్జీల వల్ల పోషకాహార కొరతతో విద్యార్థులు రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవలసిన అధికారులు పట్టించుకోవడం లేదు.

-వి.మహేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం

విద్యార్థులు మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల అనారోగ్య పరిస్థితులపై మాకు సమాచారం అందిన వెంటనే స్పందించి తక్షణ వైద్య సేవలు అందిస్తున్నాం. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు తాగునీరు, ఆహారం కలుషితమైనప్పుడు, పరిశుభ్రత లోపించినప్పుడు, ఉడకని ఆహార పదార్థాలు తిన్నప్పుడు డయేరియా వంటి అనారోగ్య పరిస్థితులు ఎదురవుతున్నాయి.

-కె.లీలాప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి

ఆర్‌జెడి బాధ్యతల నుంచి ప్రతాప్‌రెడ్డిని తొలగించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టరు హోదాలో ఎన్‌సిఇఆర్‌టి విధులు నిర్వహిస్తున్న బి ప్రతాప్‌రెడ్డిని కడప ఆర్‌జెడి బాధ్యతల నుంచి వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి బాలసుబ్రమణ్యం, కెఎస్ లక్ష్మణరావు, వై శ్రీనివాసులరెడ్డి, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు. కడప ఆర్‌జెడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని బదిలీ చేసి ఆయన స్థానంలో పూర్తి బాధ్యతలతో కడప ఆర్‌జెడిగా అడిషనల్ డైరెక్టరు హోదాలో ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టరుగా ఉన్న బి ప్రతాప్‌రెడ్డిని నియమించారని పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయడంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల అధిపతులతో సమావేశాలు ఏర్పాటు చేయడం, విందు భోజనాల్లో ఎవరికి ఏమి కావాలో ముందుగానే గూగుల్ ఫాంలో సమాచారం కోరటం, ప్రైవేటు గెస్టు హౌస్‌లో లాబింగ్ సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు ఉపాధ్యాయుల భుజాలపై చేతులు వేయడం, ఆలింగనాలు చేయడం వంటి చిల్లర చేష్టలకు పోయి పోస్టు స్థాయిని దిగజారుస్తూ.. అధికార పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నట్లు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డిపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కడప జిల్లా కలెక్టరును విచారణకు ఆదేశించారని తెలిపారు. హయ్యర్ కేడర్‌లో ఉన్న మధుసూదనరావును లోయర్ పోస్టులో ఎలా నియమిస్తారని, ప్రకాశం జిల్లా డిఇఒగా పనిచేస్తున్న విజయభాస్కర్‌ను రిలీవ్ చేశారని, దీనిపై వివరణ ఇవ్వాలని ప్రవీణ్ ప్రకాష్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. కడప ఆర్‌జెడి ప్రతాపరెడ్డిని బాధ్యతల నుంచి వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వ్యవహారశైలిపై కమిషన్ ఆఫ్ ఇండియా, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా, డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ వారికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరపున ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై టిడిపి ఫిర్యాదు

గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్దఎత్తున ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఓటర్లను అధికార పార్టీ ప్రలోభపెట్టడంతోపాటు భయభ్రాంతులకు గురిచేస్తోందని టిడిపి ఆరోపించింది. ఈ మేరకు సచివాలయంలోని రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి ముకేష్ కుమార్ మీనాకు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు నేతృత్వంలోని టిడిపి ప్రతినిధుల బృందం సోమవారం ఫిర్యాదు చేసింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని సిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. కడప జిల్లాకు చెందిన అధికారి ప్రతాప్‌రెడ్డి, ఆంధ్ర యూనివర్సిటీ విసి ప్రసాద్‌రెడ్డిని పదవుల నుంచి తప్పించాలని, యూనివర్సిటీని ప్రస్తుతం వైసిపి కార్యాలయంగా మార్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శనివారం విశాఖలోని ప్రైవేటు హోటల్‌లో కాలేజీల యాజమాన్యంతో మీటింగ్ ఏర్పాటు చేసి వైసిపికి ఓటు వేయాలని, లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవంటూ విసి మాట్లాడటం, వామపక్ష, ప్రజా సంఘాలు వీడియో తీస్తుంటే.. వంట గదిలోంచి విసి అక్కడ నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఫిర్యాదుపై సిఇఒ సానుకూలంగా స్పందించి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చినట్లు టిడిపి నేతలు పేర్కొన్నారు.

మాతృ భాషకు ప్రాధాన్యత ఇవ్వండి

- సిఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహించే మాతృభాషా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 21 మాతృభాషా దినోత్సవాన్ని 'బహు భాషా విద్య' అనే థీమ్‌తో యునెస్కో నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ ఘనంగా జరపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై విచారం వ్యక్తం చేస్తూ సిఎం వైఎస్ జగన్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం లేఖ రాశారు.

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అత్యధిక మంది మాట్లాడే తెలుగు భాషను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. విద్యలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టి తెలుగు భాషను పూర్తిగా దూరం చేయడం సరైందికాదన్నారు. తెలుగు రాయలేని, ఇంగ్లీష్ మాట్లాడలేని దుస్థితి పిల్లలకు వస్తుందన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతికతను అర్థం చేసుకుని మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఉన్నత శ్రేణి మేధావులుగా, శాస్త్రవేత్తలుగా మారటానికి ఈ చర్య ఏమాత్రం దోహదం చేయదని పేర్కొన్నారు. ప్రపంచంలో అమెరికా, స్పెయిన్, చైనా, జపాన్, కొరియా, జర్మనీ, రష్యా వంటి అనేక దేశాలు వారి మాతృ భాషల్లోనే చదువును చెప్పి ప్రపంచంలో అగ్రగామి దేశాలుగా మారాయని పేర్కొన్నారు. ఈ అనుభవాన్ని పరిశీలించినప్పుడు మాతృ భాష ప్రాధాన్యత, ఆవశ్యకత అర్థమవుతుందన్నారు. ప్రాథమిక విద్యను మాతృ భాషలో నేర్పి ఇతర భాషలు కూడా నేర్చుకుని ఎవరికి ఏ భాష ఇష్టమైతే ఆ భాషలో రాణించగలిగిన అవకాశాన్ని ఇచ్చేలా ప్రభుత్వ విద్యా విధానం లక్ష్యంగా ఉండాలని సూచించారు. మాతృ భాషను నిర్లక్ష్యం చేస్తూ ఇంగ్లీషును బలవంతంగా రుద్దటం జాతికి ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు.

మనదేశంలో తెలుగుతోపాటు ఉర్దూ, ఇంకా అనేక ఆదిమ భాషలున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వారి వారి భాషల్లో చదువు నేర్పటానికి భాషా వాలంటీర్లను నియమించారని, కానీ ఇప్పుడు వారిని తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ గిరిజన సంస్కృతిని నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాషా వాలంటీర్లు ఇప్పుడు గాలిలో ఉన్నారని, మధ్యలో వారిని తొలగించి గిరిజనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. మరలా ఆందోళన తర్వాత కొంతమందిని తాత్కాలికంగా నియమించారని తెలిపారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతాల్లో భాషా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి వారి భాషల్లోనే చదువు చెప్పడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆరో తరగతి తర్వాత ఎవరు ఏ భాషలో అయినా చదువు నేర్చుకోవడానికి ఇంగ్లీషుతోసహా అవకాశం కల్పించే విధానం శాస్త్రీయమని తెలిపారు. మాతృభాషలో పాఠ్యగ్రంథాలు అందుబాటులో ఉంచాలని యుజిసి మన గవర్నర్‌కు లేఖ రాసిన విషయం ఈ సందర్భంగా గమనార్హమన్నారు. అందువల్ల ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న మాతృ భాష ఉద్యమాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రోత్సహించి, నిర్వహించి, దానికి అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చేయాలని, తెలుగు మాధ్యమాన్ని కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.



తారకరత్నకు కన్నీటి వీడ్కోలు

- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన సినీ నటుడు నందమూరి తారకరత్న (40) అంత్యక్రియలు సోమవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిశాయి. నందమూరి కుటుంబ సభ్యులు, సినీరంగ ప్రముఖులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. అభిమానుల సందర్శనార్థం సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మోకిలలోని నివాసం నుంచి తారకరత్న భౌతికకాయాన్ని ఫిలిం ఛాంబర్‌కు తరలించారు. కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడని దూరంగా ఉంటున్న తారకరత్న తల్లిదండ్రులు చివరిసారిగా కుమారుడ్ని చూసేందుకు ఫిలిం ఛాంబర్‌కు వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంపి విజయసాయిరెడ్డి, జూనియర్ ఎన్‌టిఆర్ దంపతులు, కల్యాణ్ రామ్, పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్, సురేష్ బాబు, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, నటులు తరుణ్, శివబాలాజీ, అన్నపూర్ణ, పరచూరి బ్రదర్స్, కెఎ పాల్, తదితరులు తారకరత్నకు అంజలి ఘటించారు. అభిమాన నటుడిని చివరిసారి చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఫిలిం ఛాంబర్‌కు తరలివచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఫిలిం ఛాంబర్ నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. బాలకృష్ణ, ఇతర కుటుంబ సభ్యులు పాడిమోయగా.. తారకరత్న తండ్రి మోహన కృష్ణ కుటుంబ సాంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

'రమ కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించాలి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు మలిపెద్ది రమ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వరలక్ష్మి, దయా రమాదేవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టిలో మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు వంట చేస్తూ ఈ నెల 14వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో మలిపెద్ది రమ తీవ్ర గాయాలపాలైందని తెలిపారు. ఈ నెల 18న చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఇటువంటి ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

9న విజయవాడలో భారీ ధర్నా

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 9న విజయవాడలో భారీ ధర్నా చేపట్టాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల్లో పెద్దఎత్తున మార్పులు తీసుకొచ్చిందన్నారు. నిత్యావసర ధరలను భారీగా పెంచి సామాన్యులను జీవించలేని స్థితికి నెట్టేశారని అన్నారు. ఆహార భద్రతకు, ఐసిడిఎస్‌కు చేసిన కేటాయింపుల్లో భారీ కోతలు పెట్టారన్నారు. అంగన్వాడీల వేతనాలను పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 20న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్దఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు చేసిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారని అన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలను ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోగా వేధింపులు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుప్రజ, నాగశేషు, లక్ష్మీదేవి, కృష్ణవేణి, సుధారాణి, చంద్రావతి, ఐ వేమేశ్వరి, బి లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజల మధ్యకు వెళ్లండి

- ఎమ్మెల్సీ అభ్యర్థులతో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి రాజకీయంగా సామాజిక న్యాయం పాటించి పదవులను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పెద్దఎత్తున కట్టబెడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కొత్తగా అవకాశం దక్కిన ఎమ్మెల్సీ అభ్యర్థులు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు. శాసనమండలికి ఎంపికైన ఎమ్మెల్సీ అభ్యర్థులు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్‌ను కలిసి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 18 మంది పేర్లను ప్రకటిస్తే అందులో 14 ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన వారే ఉన్నారని సిఎం ఈ సందర్భంగా అన్నారు. ఎమ్మెల్సీలుగా బాధ్యతలు తీసుకుంటున్నవారు పార్టీ కోసం ఏం చేయగలుగుతారో అది చేయాలని, తను చేయాల్సింది చేశానని అన్నారు. రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

- 40 రోజులైనా జమ కాకపోవడం పట్ల రైతుల ఆగ్రహం
- పౌరసరఫరాలశాఖ కమిషనరు కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖరీఫ్‌లో కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయాలని, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కాటా, కూలి, రవాణా ఛార్జీలు చెల్లించాలని కోరుతూ విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరు కార్యాలయం ఎదుట ఎపి కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. రైతులు ధాన్యం తోలి నెలరోజులు దాటినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయన్నారు. అనధికారికంగా మిల్లులకు తోలిన ధాన్యానికి వెంటనే ట్రిప్‌షీట్ జనరేట్ చేసి డబ్బులు ఇవ్వాలని, రైతులకు అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యాన్ని రవాణా చేసే అవకాశం కల్పించాలని, రైతులకు అవసరమైనంత మేర సంచులు, ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లాలో 40 మిల్లుల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు నిలిపివేశారన్నారు. 40 శాతం కుప్పలు నూర్చాల్సినవి ఉన్నాయని, ధాన్యాన్ని తప్పనిసరిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని హరిబాబు డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పివి ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు కె శివనాగేంద్ర, కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, పివి లక్ష్మణస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ రామాంజనేయప్రసాద్, మద్దాలి సాయిబాబా, కైలే ఏసుదాసు, మరియదాసు, కొండా రామిరెడ్డి, చోరుగోడి బాయమ్మ పాల్గొన్నారు. అనంతరం కమిషనరు కార్యాలయంలో ఎమ్‌డి, కమిషనరు అందుబాటులో లేకపోవడంతో ప్రొక్యూర్‌మెంటు మేనేజరు శిరీషకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వారంలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు.

'హిందూజా'కు అదనపు చెల్లింపులు అడ్డుకోవాలి

- ఎపిఇఆర్‌సికి సిపిఎం నేత బాబూరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందూజా సంస్థకు విద్యుదుత్పత్తికి సంబంధించి చట్ట విరుద్ధంగా రూ.1234.68 కోట్ల అదనపు చెల్లింపులు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సోమవారం లేఖ రాశారు. హిందూజాకు చెల్లించేందుకు పంపిణీ సంస్థలు రుణం తీసుకునేందుకు విడుదల చేసిన జిఓను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికశాఖ అభ్యంతరాలు తెలిపినా.. న్యాయ సలహాల పేరుతో అదనపు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని స్పష్టమైన సమాచారం వస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన జరిగిన క్యాబినెట్‌లో అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలు, పార్టీలు, ప్రజా సంఘాలు, నిపుణుల అభ్యంతరాలు తెలియజేసినా, వాటిని బేఖాతరు చేస్తూ పంపిణీ సంస్థలు, ప్రభుత్వం చట్ట విరుద్ధ నిర్ణయాలు చేయటం సరికాదన్నారు. ప్రజలపై అదనపు భారాలను నివారించాలని కోరారు. చెల్లింపులకు సంబంధించిన అన్ని రికార్డులనూ తెప్పించుకోవాలని సూచించారు. అదనపు చెల్లింపులపై ఇఆర్‌సి బహిరంగ విచారణ నిర్వహించాలని, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం చట్టబద్ధంగా కల్పించాలని కోరారు. దీనిని నిలుపుదల చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు.

వడ్డీ డబ్బులేవీ?

- సిఎస్‌ఎస్ నిధులపై రాష్ట్రాలకు కేంద్రం లేఖలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పలు కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఇచ్చిన నిధులపై బ్యాంకుల ద్వారా వచ్చే వడ్డీ నిధులపైనా కేంద్రం ఆరా తీస్తోంది. ఈ డబ్బులు తమకు చెందాలని కేంద్రం అంటోంది. కేంద్రానికి సంబంధించిన నిర్దిష్ట ఖాతాలోకి ఈ వడ్డీ సొమ్మును జమ చేయాలని అన్ని రాష్ట్రాలకూ సర్క్యులర్లు జారీ చేస్తోంది. రాష్ట్రాల్లో అమలు చేసే కేంద్ర పథకాలకు కేంద్రం కొంత నిధులు అందిస్తుంది. దానికి రాష్ట్రాలు కూడా కొంత వాటా నిధులను జత చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం నిధులను సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకు ఖాతాలోనే నిల్వ ఉంచాలి. అయితే అనేక రాష్ట్రాల్లో కేంద్ర నిధులను సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకులో జమ చేసి, తమ వాటా నిధులను ఇంకా జత చేయని పరిస్థితి ఉందని కేంద్రం అంటోంది. కేంద్ర నిధులపై ఆయా రాష్ట్రాలకు భారీగానే వడ్డీ సమకూరుతోందని కేంద్రం భావిస్తోంది. ఆ వడ్డీ కేంద్రానికే చెందుతుందని, అందుకే ఈ వడ్డీ నిధులు తమకు వాపసు చేయాల్సిందేనని కేంద్ర ఆర్థికశాఖ స్పష్టం చేస్తోంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాస్తోంది.

సిఎన్ఎ ఖాతాలపైనా..

సెంట్రల్ నోడల్ ఏజెన్సీ ఖాతాల్లో నిధులపైనా కొన్ని పరిమితులు విధించారు. ఈ ఖాతాలో మొత్తం కేటాయింపుల్లో ఒకసారి 25 శాతానికి మించకుండా ఉండరాదని కేంద్రం పేర్కొంది. నాలుగు విడతలుగా ఇచ్చే సొమ్ములో ఈ విధానాన్ని పాటించాలని తేల్చిచెప్పింది. కేంద్రం ఇచ్చే నిధుల్లో కూడా ఒక కిస్తు విడుదల్లో 25 శాతం దాటకుండా చూడాలని కూడా తేల్చిచెప్పింది.

ఐఎఎస్ శ్రీలక్ష్మి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మి కేసు విచారణ వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసులో శ్రీలక్ష్మికి విముక్తి కలిపిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో సిబిఐ సవాల్ చేసింది. అనివార్య కారణాల వల్ల విచారణకు శ్రీలక్ష్మి తరపున న్యాయవాదులు హాజరుకాలేదు. దీంతో విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

పోలవరం పూర్తికి కేంద్రం నిధులివ్వాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. నిడమర్రు, పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ ఆప్రూవల్ చేసినా కేంద్రం ఎందుకు నిధులివ్వడం లేదని ప్రశ్నించారు. ఇందుకోసం అధికార, ప్రతిపక్ష పార్టీలందరూ కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రం వాల్ తదితర ప్రాంతాల వివరాలను పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌బాబు వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టులపై తమ పార్టీ నాయకత్వం పరిశీలిస్తోందని, గుర్తించిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులను పరిశీలించామన్నారు.

గోదావరి జిల్లాలు, కోస్తా ప్రాంతంతోపాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు సైతం ఉపయోగపడే ప్రాజెక్టు పోలవరం అని చెప్పారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం వల్ల రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2900 కోట్లు ముందస్తుగా ఖర్చు చేసిందని, ఆ సొమ్ము కోసం ఢిల్లీ పాలకుల చుట్టూ సిఎం, ఆర్థిక మంత్రి ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో ఎవరూ చెప్పలేరన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

- ఎయు విసిపై చర్యలు తీసుకోవాలి



కాకినాడ పిఆర్ జూనియర్ కాలేజీ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం), కాకినాడ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులను విధుల నుంచి తొలగించాలని సిపిఎం, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విశాఖపట్నం, కాకినాడలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించాయి. విశాఖ మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం మాట్లాడుతూ ఎయు విసి పివిజిడి ప్రసాద్‌రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ ఉన్నత పదవుల్లో ఉంటూ అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ఓ హోటల్లో ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ఆదివారం సమావేశం నిర్వహించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వారిద్దరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఉన్నత బాధ్యతల్లో ఉంటూ విసి, మాజీ రిజిస్ట్రార్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం దారుణమన్నారు. రాష్ట్ర గవర్నర్, ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ పాల్గొన్నారు.

విసిని భర్తరఫ్ చేయాలి : విద్యార్థి సంఘాలు

ఎయు విసిని భర్తరఫ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. విద్యా వ్యవస్థను విసి భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు.

అధికార దుర్వినియోగంపై ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని, ఆంధ్ర యూనివర్శిటీ విసి ప్రసాద్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పిఆర్ జూనియర్ కాలేజ్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ నగర కార్యదర్శి ఎం గంగాసూరిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి జి దినేష్‌కుమార్ మాట్లాడారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ లబ్ధి కోసమే ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని ఆగమేఘాలపై కడప జిల్లాకు తీసుకొచ్చారని విమర్శించారు. విశాఖలోని ఓ హోటల్‌లో విసి ప్రసాద్‌రెడ్డి ప్రయివేటు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్లతో ఎన్నికల ప్రచారం కోసం సమావేశం నిర్వహించడం దారుణమన్నారు. ఈ సమావేశానికి వైసిపి నాయకులు సైతం హాజరయ్యారన్నారు. ఎన్నికల నిబంధనలను అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఇద్దరినీ విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు, పిఆర్ కళాశాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఎన్‌హెచ్‌ఎంకు బడ్జెట్లో నిధులు పెంచాలి

కలెక్టరేట్ వద్ద 'ఆశా'ల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం కలెక్టరేట్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కు బడ్జెట్లో నిధులు పెంచాలని కోరుతూ సోమవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ధర్నాలో యూనియన్ జిల్లా నాయకులు ఎం.శకుని మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంకు బడ్జెట్లో నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆశా వర్కర్లకు పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పింఛను అమలు చేయాలని, ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణరావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ కోవిడ్ కాలంలో ఆశా వర్కర్లు ప్రాణాలకు తెగించి పని చేశారని తెలిపారు. ప్రభుత్వం వారి రక్షణకు కనీస భరోసా కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన, సహజ మరణం సంభవించిన వారి కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని, ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఏ నెల వేతనం ఆ నెల సకాలంలో చెల్లించాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు.



216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

సాగునీటి కోసం అన్నదాతల రాస్తారోకో

ప్రజాశక్తి - తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

తమ పొలాలకు సాగునీటిని అందించాలంటూ అన్నదాతలు రోడ్డెక్కారు. కాకినాడ జిల్లా తాళ్లరేవులోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట 216 జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకోకు దిగారు. 'నీరైనా ఇవ్వండి, పరిహారం అయినా చెల్లించండి' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. రిలయన్స్, ఒఎన్‌జిసి వంటి సంస్థలకు తరలిస్తున్న నీటిని నిలిపేసి వాటిని పొలాలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రాస్తారోకోలో తాళ్లరేవు మండలంలోని శివారు భూముల రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, పలువురు రైతులు మాట్లాడారు. సాగునీరు లేక పంట పొలాలు బీటలు వారుతున్నాయన్నారు. ఇదే విషయమై పదిరోజుల క్రితం ఆందోళన నిర్వహించామని, కలెక్టర్‌కు సైతం తమ గోడును వినిపించుకున్నామని తెలిపారు. ఆ సమయంలో సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని నేటికీ చుక్కనీటిని అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతు సంఘం నాయకులతో కోరంగి ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, తహశీల్దార్ పోతురాజు, ఇరిగేషన్ ఎఇ ఈశ్వర్ చర్చలు జరిపారు. మంగళవారం నుంచి పొలాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఆందోళనకు టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఎపికౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, టిడిపి, జనసేన, పోలేకుర్రు నీటి సంఘం మాజీ అధ్యక్షులు రామకృష్ణంరాజు, శివారు ప్రాంతాల రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ దంపతులు

ప్రజాశక్తి- శ్రీశైలం


గవర్నర్ కుటుంబ సభ్యులకు పూర్ణకుంబంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, ఇఒ

ప్రసిద్ధ శైవక్షేత్రమైన భ్రమ రాంబా మల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమ వారం సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. శ్రీశైలంలోని భ్రమరాంబా అతిథిగృహం వద్ద కాసేపు సేద తీరిన అనంతరం శ్రీశైలమల్లన్న ఆలయానికి చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్, ఆయన భార్య సుప్రభ హరిచందన్, కుమారుడు ప్రశంజిత్ హరిచందన్, కోడలు సరోజిని హరిచందన్‌కు ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఇఒ లవన్న, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ వెంట జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డిలు ఉన్నారు.

3,340 మెగావాట్ల ఉత్పత్తి

- బడ్జెట్‌లో అదనపు నిధుల కేటాయింపులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనపు విద్యుత్ ఉత్పత్తికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నాలుగు సంస్థల ద్వారా 3,340 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రతిపాదించారు. అయితే ఇవి ఇప్పటికే నిర్మాణంలో ఉన్నవే కావడం గమనార్హం. వీలైనంత వరకు వచ్చే ఏడాదే వీటిని పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నాలుగు కేంద్రాలకు రానున్న బడ్జెట్‌లో అదనపు నిధులు కేటాయించాలని కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నార్ల తాతారావు థర్మల్ కేంద్రం ద్వారా 800 మెగావాట్లను, పోలవరం జల విద్యుత్ కేంద్రంలోని 12 టర్బయిన్ల ద్వారా 960 మెగావాట్లను, ఎగువ సీలేరు పంప్‌డ్ స్టోరేజ్ కేంద్రం ద్వారా 1350 మెగావాట్లను, దిగువ సీలేరు కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా 230 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తిని చేసేందుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఉత్పాదక కేంద్రాల ద్వారా 5613 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో థర్మల్ కేంద్రాల ద్వారా 3410 మెగావాట్లు, జల విద్యుత్ కేంద్రాల ద్వారా 1797 మెగావాట్లు, సౌర విద్యుత్ ద్వారా 405 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. తాజాగా వీటికి అదనంగా 3340 మెగావాట్లను ఉత్పత్తి చేసేందుకు ప్రతిపాదిస్తున్నారు. ఇందులో ఎన్‌టిటిపి కేంద్రానికి రూ.650 కోట్లు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొదట రూ.7586 కోట్లతో అనుమతించగా, ఇప్పుడు ఆ అంచనా రూ.8135 కోట్లకు చేరుకుంది. అలాగే దిగువ సీలేరు ప్రాజెక్టుకు రూ.350 కోట్లు, పోలవరం జల విద్యుత్ కేంద్రానికి రూ.1877 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

దుర్గ గుడిలో అనధికారిక పులిహోర అమ్మకాలపై విచారణకు ఆదేశం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలోని కనకదుర్గ ఆలయంలో రసీదుల్లేకుండా జరుగుతున్న పులిహోర అమ్మకాలపై ఆలయ ఇఒ భ్రమరాంభ విచారణకు ఆదేశించారు. ఈ నెల 19న 'దుర్గ గుడిలో అనధికారిక ప్రసాదాలు, రసీదుల్లేకుండా పులిహోర అమ్మకాలు', తెర వెనుక ఓ ప్రజాప్రతినిధి అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రిక మెయిన్‌పేజీలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. పులిహోర కుంభకోణానికి సంబంధించి, పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంటు నగేష్‌ను విచారణాధికారిగా నియమించారు. పులిహోర విభాగానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న మహిళా ఉద్యోగిని గతంలో ఎసిబి సస్పెండ్ చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను రెండు రోజుల్లో అందించాలని, నివేదిక అందిన వెంటనే ఇందుకు సంబంధించిన వారిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తుందని ఆలయ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. పులిహోర కుంభకోణం గురించి పలువురు యాత్రికులు దేవాదాయశాఖ కమిషనరు హరి జవహర్‌లాల్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఆలయ ఇఒ విచారణకు ఆదేశించారు. ఈ విషయంపై దేవాదాయశాఖ మంత్రి కె సత్యనారాయణ కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

సెన్సెక్స్ 311 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులతో సోమవారం భారత మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ స్టాక్స్, రిలయన్స్, అదాని సూచీల అమ్మకాలతో సెన్సెక్స్, నిఫ్టీలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ.. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 311 పాయింట్లు కోల్పోయి 60,692కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 100 పాయింట్లు తగ్గి 17,845 వద్ద ముగిసింది. అదాని గ్రూపు ఎకౌంట్స్ మోసాలకు పాల్పడుతుందని హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో గత కొన్ని రోజులుగా బ్యాంక్ సూచీలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 1.05 శాతం కోల్పోయింది. ఆటో, ఐటి రంగాలు మినహా మిగిలిన రంగాలు నష్టాలు చవిచూశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు పెంచుతుందన్న భయాలు సూచీలను ఒత్తిడికి గురి చేశాయి. బిఎస్ఇలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 1.01 శాతం లేదా రూ.24.55 కోల్పోయి రూ.2,415కు పడిపోయింది. అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 5.94 శాతం పతనమై రూ.1,619కి పడిపోయింది. ఇంట్రాడేలో ఈ సూచీ రూ.1,561 కనిష్ట స్థాయిని తాకింది.

ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు

ఎపిఇఆర్‌సి చైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

నెలకు 200 యూనిట్ల పైబడి విద్యుత్తు వినియోగించే కనెక్షన్లకు ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేసేకుందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) చైర్మన్ సివి నాగార్జునరెడ్డి తెలిపారు. తిరుపతి కేశవాయనగుంటలోని ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఎపిఇఆర్‌సి 18వ రాష్ట్ర సలహాదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను విద్యుత్ వినియోగం, వ్యయాలకు సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్రంలోని మూడు విద్యుత్ కార్పొరేట్ సంస్థలు తమకు సమర్పించాయన్నారు. వాటిని పరిశీలించి, వినియోగదారులపై భారాలు పడనీయకుండా సంస్థ అభివృద్ధికి సంబంధించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, వినియోగదారుడి ఇబ్బందులపై చర్చించామన్నారు. రైతులకు రాబోవు 30 సంవత్సరాలకు సరిపడి ఉచిత విద్యుత్తు అందించేందుకు అవసరమైన సోలార్ సిస్టమ్‌ను విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పటికే సిద్ధం చేశాయని, వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి, రైతులకు అందిస్తున్నాయని వెల్లడించారు. మోటార్లకు మీటర్లు అనేది ప్రభుత్వ విధానమని, దీని ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందే తప్ప, రైతులకు ఎలాంటి అదనపు భారాలు ఉండబోవని ఇప్పటికే అటు ప్రభుత్వం, ఇటు విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయని గుర్తు చేశారు. మోటార్లకు మీటర్లు ఏర్పాటుపై రైతులకు ఉన్న అనుమానాలు కేవలం అపోహాలు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ వర్చువల్ విధానం వల్ల ఎక్కువ మందితో ఎపిఇఆర్‌సి ఇంట్రాక్టు అవుతోందని, గతంలో నేరుగా వినియోగదారులను కలుసుకునే విధానం కంటే వర్చువల్ విధానంపై ఎక్కువ స్పందన వస్తోందన్నారు. ఈ సమావేశంలో ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూరు రామసింగ్, రాజగోపాల్‌రెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోషరావు, డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'అమరరాజా'పై ప్రజాభిప్రాయ సేకరణ


- ఎపిపిసిబికి 'సుప్రీం' ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరరాజా బ్యాటరీస్ కాలుష్య వ్యవహారంపై ప్రజాభి ప్రాయ సేకరణ నిర్వహించి, చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఎపిపిసిబి)కి సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎపిపిసిబికి షోకాజ్ నోటీసులపై గతంలో ఇచ్చిన స్టేను అత్యున్నత న్యాయస్థానం ఎత్తివేసింది. సంస్థ మూసివేతపై హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వు కొనసాగుతుందని తెలిపింది. అమర రాజా బ్యాటరీస్ తీవ్ర కాలుష్యం వెదజల్లుతోందని, దీనివల్ల పరిసర ప్రాంతాల జలాల్లో సీసం ధాతువు (లెడ్ కంటెంట్)లు పెరుగుతున్నందున సంస్థను మూసి వేయాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి గతంలో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సదరు నోటీసులపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లవచ్చని హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ బ్యాటరీస్ సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రాస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

అదాని 25వ స్థానానికి పతనం

- 50 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్
- ఫోర్బ్స్ వెల్లడి



న్యూఢిల్లీ : తీవ్ర ఆర్థిక మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతం అదాని సంపద క్రమంగా హరించుకుపోతోంది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో అదాని కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో రోజురోజుకు బొక్కబోర్ల పడుతున్నాయి. దీంతో అదాని సంపద లక్షల కోట్లు ఆవిరవుతోంది. వరుస పతనంతో అదాని సంపద తాజాగా 50 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.9 లక్షల కోట్లు)కు పడిపోయిందని ఫోర్బ్స్ సోమవారం వెల్లడించింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో అదాని స్థానం 25కు పడిపోయిందని ఫోర్బ్స్ రియల్‌టైం బిలియనీర్ ఇండెక్స్ తెలిపింది. గుజరాత్‌కు చెందిన ఈ పెట్టుబడిదారుడు నెల క్రితం 147 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12 లక్షల కోట్ల పైగా) సంపదతో ప్రపంచంలోనే రెండో స్థానంలో, ఆసియాలో అతిపెద్ద కుబేరుడిగా ఉన్నారు. ముకేశ్ అంబానీ ప్రపంచంలో 85 బిలియన్ డాలర్ల సంపదతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. అదాని కంపెనీలు తీవ్ర ఎకౌంట్స్ మోసాలకు, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకుంటున్నాయని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ దెబ్బకు అదానిపై జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు విశ్వాసాన్ని కోల్పోయారు. దీంతో అదాని గ్రూపు కంపెనీల్లోని షేర్లను కొనడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ ప్రభావంతో ఆ స్టాక్స్ విలువ నెల రోజులుగా క్రమంగా పడిపోతోంది.

సోమవారం అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ విలువ మరో 6.37 శాతం లేదా రూ.109.70 పతనమై రూ.1,613కు దిగజారింది. 2022 నవంబర్‌లో ఈ స్టాక్ రూ.4,190 గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. అదాని ట్రాన్స్‌మిషన్, అదాని టోటల్ గ్యాస్, గ్రీన్ ఎనర్జీ సూచీలు పడిపోతూనే ఉన్నాయి. అదానీ గ్రూప్‌లోని తొమ్మిది స్టాక్స్ నష్టాల్లోనే ముగిశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ ఐదు శాతం మేర నష్టపోయాయి. ఎన్‌డిటివి 3.75 శాతం, అదానీ విల్మార్ 2.38 శాతం, అంబుజా సిమెంట్ 1.09, అదానీ పవర్ ఐదు శాతం, అదానీ పోర్ట్స్ 0.24 శాతం, ఎసిసి 0.87 శాతం చొప్పున నష్టాలతో ముగిశాయి. గడిచిన జనవరి 24న అమెరికా షార్ట్ షెల్లర్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో అదానిపై తీవ్ర ఆర్థిక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదాని కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 135 బిలియన్ డాలర్లకు పైగా ఆవిరయ్యిందని అంచనా.

అప్పులిస్తునే ఉంటాం : బిఒబి

అదాని కంపెనీల పరపతిపై తీవ్ర అనుమానాలు, ఆరోపణలు చోటు చేసుకుంటున్న క్లిష్ట సమయంలోనూ విత్త సంస్థలు అప్పులివ్వడానికి ముందుకు రావడం గమనార్హం. అదాని గ్రూపునకు మరిన్ని అప్పులిస్తామని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎండి సంజీవ్ చద్దా పేర్కొన్నారు. పూచీకత్తు ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తే రుణాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. అయితే ఇప్పటి వరకు అదాని కంపెనీలకు బిఒబి ఎంత అప్పులిచ్చిందనే విషయాన్ని ఆయన వెల్లడించకపోవడం విశేషం.

సంపాదకీయం

విద్వేష హత్యలు

రాజస్థాన్ భరత్‌పూర్ జిల్లాకు చెందిన ఇద్దరు ముస్లిం యువకుల సజీవ దహనం బిజెపి అండదండలతో సంఘ పరివారం సాగిస్తున్న మూక దాడుల పరంపరకు కొనసాగింపు. ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న పేరిట నజీర్, జునైద్‌లను బుధవారం బజరంగ్‌దళ్ గూండాలు కిడ్నాప్ చేయగా, మరుసటి రోజు వారి మృతదేహాలు హర్యానా భివాని జిల్లా లోహారు వద్ద దగ్ధమైన బొలేరో కారులో కాలి పడి ఉన్నాయి. మృతుల కుటుంబ సభ్యుల కథనాలను బట్టి ప్రతి కిడ్నాప్ చేసిన గూండాలే హత్య చేశారని అర్థమవుతుంది. కానీ ఇటు రాజస్థాన్ పోలీసులు అటు హర్యానా పోలీసులు మాత్రం స్పష్టమైన ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. దానిక్కారణం హత్యకు గురైన యువకులది రాజస్థాన్ అయితే మృతదేహాలు దొరికింది హర్యానాలో. రాజస్థాన్ పోలీసులు అపహరణ కేసు నమోదు చేయగా హర్యానా పోలీసులు అనుమానాస్పద మృతి అంటున్నారు. హంతకులను ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదు. ఈ వ్యవహారంలో పెద్ద ట్విస్ట్... కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులను గూండాలు రాష్ట్రం దాటించి వందల కిలోమీటర్లు తరలించడం. ఇదంతా చూస్తుంటే గోగూండాల కిరాతకాలకు వ్యవస్థీకృతంగా పోలీసుల నుంచి మద్దతు ఉందని అనుమానం కలుగుతుంది. మరీ ముఖ్యంగా బిజెపి అధికారంలో ఉన్న హర్యానాను హంతకులు సేఫ్ షెల్టర్ జోన్ కింద మార్చుకున్నారని ధృవపడుతుంది.

యువకుల హత్య యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఇటీవలి కాలంలో మేవాంత్ ప్రాంతంలో గోగూండాలు చేస్తున్న వరుస హత్యల్లో భాగం. హర్యానా ప్రభుత్వం 2015లో గోవంశ్ సంరక్షణ చట్టం తెచ్చిన దగ్గర నుంచి గోగూండాలు రెచ్చిపోతున్నారు. ఇప్పుడు ఎవరైతే హత్య కావించబడ్డారో అదే గ్రామానికి చెందిన పశువుల వ్యాపారి ఉమర్‌ఖాన్‌ను 2017లో సంఘ్ పరివార్ దుండగులు కాల్చి చంపారు. దానికి కొన్ని నెలల ముందు పాడి రైతు పెహ్లూఖాన్‌ను దారుణంగా హత్య చేశారు. ఇప్పటికీ వీరి కుటుంబాలకు న్యాయం జరగలేదు. ప్రస్తుత కేసుల్లోనూ బాధితులకు న్యాయం జరుగుతుందన్న గ్యారంటీ లేదు. హత్యకు గురైన వారిలో జునైద్ పేద వ్యవసాయ కార్మికుడు, నసీర్ ట్రక్కు డ్రైవర్. వారిని కోల్పోయిన కుటుంబాలు అనాథలయ్యాయి. సంపాదించే వ్యక్తిని కోల్పోయిన జునైద్, నసీర్ కుటుంబాలకు ఆపన్న హస్తం అందించి అన్ని విధాలా ఆదుకోవడం ప్రభుత్వాల బాధ్యత.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక కుట్ర పూరితంగా ముస్లింలు, దళితులపై దాడులు జరుగుతున్నాయి. రెండవ తడవ మోడీ సర్కార్ వచ్చాక విద్వేష దాడులు పెరిగాయి. పాడి రైతులు, పశువుల వ్యాపారులు లక్ష్యంగా సంఘ్ పరివార్ దుండగులు సాగిస్తున్న క్రూరమైన అసహన దౌర్జన్యాలు కోకొల్లలు. రాజధాని ఢిల్లీ పక్కనే నోయిడాకు దగ్గరలో 2015 సెప్టెంబర్‌లో ఇంటిలో బీఫ్ ఉందంటూ మహ్మద్ అఖ్లాఖ్‌ను గోగూండాలు పాశవికంగా హత్య చేశారు. దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసు విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ప్రారంభం కావడానికి ఐదేళ్లు పట్టింది. ఇంకా నిందితులెవరో తేల్లేదు. హర్యానా, రాజస్థాన్, యుపి, మధ్యప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో బిజెపి ప్రోద్బలంతో గోసంరక్షణ పేరిట సాయుధ ముఠాలు ముస్లింలు, దళితులపై ఫాసిస్టు తరహా దాడులకు పాల్పడుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు మత విభజనను తీవ్రతరం చేసే విధంగా గోవధను, ఇతర పశువుల వధను పూర్తిగా నిషేధిస్తూ చట్టాలు తెస్తున్నాయి. మాంస వాణిజ్యం సంబంధిత వృత్తుల్లో ఉన్న ముస్లింలను, దళితులను దెబ్బతీసే ఉద్దేశంతో చట్టాలు చేస్తున్నాయి. వాటితో అమాయకులపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో అక్రమంగా నిర్బంధిస్తున్నాయి. ప్రభుత్వాలే మతోన్మాద దాడుల కొనసాగింపునకు సాయుధ గుంపులను ప్రోత్సహిస్తున్నాయి. రాజస్థాన్ యువకుల హత్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి. మత విద్వేష దాడులను ఏకోన్ముఖంగా వ్యతిరేకించాలి. రాజస్థాన్ కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల పక్షాన దృఢ చిత్తంతో వ్యవహరించాలి.

మహనీయుల మాట



నిన్న పోయింది.
రేపు ఇంకా రాలేదు.
మనకు ఈ రోజు మాత్రమే ఉంది.
ప్రారంభిద్దాం.

- మదర్ థెరిస్సా



ఆర్థిక మంత్రి నోట తప్పుదోవ పట్టించే ప్రకటన

బాధ్యత కలిగిన ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటన చేయడం ఏ మాత్రమూ సరైనది కాదు. కాని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అదే పని చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి మాట్లాడుతూ రాష్ట్రాలకు చేసిన కేటాయింపుల విషయంలో "రాష్ట్రాలకు ఆర్థిక వనరుల కేటాయింపులు భారీగా పెంచినట్టు" ఆమె ప్రకటించారు (హిందూ, ఫిబ్రవరి 11). ఈ ప్రకటన చూస్తే కేంద్రం చాలా ఉదారంగా వ్యవహరించిందన్న అభిప్రాయం కలుగుతుంది. కాని ఆ విధమైన పెరుగుదల వాస్తవంగా ఉన్నట్టు చూపించే అంకెల వివరాలను వేటినీ ఆమె ఇవ్వలేదు. బడ్జెట్ లో ఉన్న అంకెలను పరిశీలిస్తే ఏ విధంగా చూసినప్పటికీ రాష్ట్రాలకు చేసిన కేటాయింపులలో పెరుగుదల లేకపోగా తరుగుదల కనిపిస్తున్నది. మన స్థూల జాతీయోత్పత్తితో పోల్చినప్పుడు కేటాయింపులలో నికరంగా తరుగుంది. మోడీ ప్రభుత్వం మొదటి నుంచీ వనరులన్నింటినీ కేంద్రం వద్ద కేంద్రీకరించుకునే విధానాన్ని అమలు చేస్తున్నది. ఈ బడ్జెట్ లో కూడా ఆ విధానమే కొనసాగింది.



కేంద్రం వద్ద జమ అయ్యే మొత్తం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు ఎంత వాటా కేటాయించినదీ చూద్దాం. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు 42 శాతం పన్ను ఆదాయాన్ని కేటాయించమని సిఫార్సు చేసిన సంగతి మనకి గుర్తుంది. అప్పుడు కేంద్రం ఆ సిఫార్సును ఎటువంటి అరమరికలూ లేకుండా ఆమోదించినట్టు ప్రకటించింది. కాని ఇంకోపక్క వేరే వేరే పద్దుల్లో (ఆ పద్దులు ఆర్థిక సంఘం పరిధిలోకి రావు) రాష్ట్రాలకు రావలసిన వాటాలను భారీగా తగ్గించింది. నిజానికి జిడిపి ఏ మేరకు పెరుగుతుందో అదే మోతాదులో రాష్ట్రాలకు కేటాయింపులు కూడా పెరగాలి. ఆ విధంగా చేయకుండా కోతలు పెట్టింది. అందువలన మొత్తం మీద జిడిపి పెరుగుదలతో పోల్చి చూసుకున్నప్పుడు రాష్ట్రాలకు వాటాలు తగ్గిపోయాయి. ఆ తర్వాత నుంచీ మొత్తం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు దక్కే వాటా తగ్గిపోవడం మొదలైంది. 2018-19లో 36.6 శాతం, 2021-22లో 33.2 శాతం, 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం) 31.2 శాతం కేటాయించారు. ఇప్పుడు 2023-24లో 30.4 శాతమే కేటాయించారు. పన్ను రూపంలో వసూలు చేస్తే రాష్ట్రాలతో పంచుకోవాలి కనుక అదనంగా వసూలు చేసినదానికి పన్ను అని పేరు పెట్టకుండా స్పెషల్ లెవీ అని, సర్‌చార్జి అని, సెస్ అని రకరకాల పేర్లు పెట్టి ఆ రూపంలో వసూలైన ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా ఎగ్గొడుతోంది కేంద్రం. 2011-12 నాటికి అటువంటి పేర్లతో వసూలు చేసిన ఆదాయం మొత్తం ఆదాయంలో 10 శాతం ఉండేది. 2021-22 నాటికి అది అమాంతం రెట్టింపై ఇరవై శాతం అయింది.



ప్రభాత్ పట్నాయక్

> కేంద్రం వద్ద జమ అయ్యే మొత్తం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు ఎంత వాటా కేటాయించినదీ చూద్దాం. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు 42 శాతం పన్ను ఆదాయాన్ని కేటాయించమని సిఫార్సు చేసిన సంగతి మనకి గుర్తుంది. అప్పుడు కేంద్రం ఆ సిఫార్సును ఎటువంటి అరమరికలూ లేకుండా ఆమోదించినట్టు ప్రకటించింది. కాని ఇంకోపక్క వేరే వేరే పద్దుల్లో (ఆ పద్దులు ఆర్థిక సంఘం పరిధిలోకి రావు) రాష్ట్రాలకు రావలసిన వాటాలను భారీగా తగ్గించింది. నిజానికి జిడిపి ఏ మేరకు పెరుగుతుందో అదే మోతాదులో రాష్ట్రాలకు కేటాయింపులు కూడా పెరగాలి. ఆ విధంగా చేయకుండా కోతలు పెట్టింది. అందువలన మొత్తం మీద జిడిపి పెరుగుదలతో పోల్చి చూసుకున్నప్పుడు రాష్ట్రాలకు వాటాలు తగ్గిపోయాయి.

వసూలైన మొత్తం పన్నులో రాష్ట్రాల వాటా తగ్గడమే కాదు, జిడిపితో పోల్చుకున్నా తగ్గింది. గతేడాదితో పోల్చుకుంటే 2023-24లో జిడిపిలో 10.5 శాతం వృద్ధి ఉంటుందన్న అంచనాతో బడ్జెట్ తయారైంది. కాని, రాష్ట్రాలకు కేటాయించిన వాటా మాత్రం రూ.9,48,406 కోట్ల నుండి (సవరించిన అంచనా) రూ.10, 21,448 కోట్లకు మాత్రమే పెరిగింది. ఇది 7.7 శాతం పెరుగుదల మాత్రమే. జిడిపి పెరుగుదల 10.5 ఉంటుందన్నప్పుడు రాష్ట్రాల వాటా కూడా ఆ మేరకు పెరగాలి కదా. కాని అలా పెరగలేదు. మరి ఆర్థికమంత్రి భారీగా రాష్ట్రాల కేటాయింపులు పెరిగాయని ఏ విధంగా ప్రకటించారు? అటు పన్ను వసూళ్ళతో పోల్చి చూసినా, ఇటు జిడిపి వృద్ధి రేటుతో పోల్చి చూసినా పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా వాస్తవంగా తగ్గిపోయింది.

ఇక రాష్ట్రాలకు మొత్తంగా జరిగే నిధుల బదలాయింపుల సంగతి చూద్దాం. ఈ బదలాయింపు నాలుగు రకాలుగా ఉంటుంది. ఒకటి: మొత్తం వసూలైన పన్నుల్లో రాష్ట్రాల వాటా. రెండు: ప్రత్యేక సహాయంపేరుతో పెట్టుబడుల వ్యయం కోసం రాష్ట్రాలకు ఇచ్చే రుణాలు, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం వగైరా. మూడు: కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు కోసం, కేంద్ర పథకాల కోసం ఇచ్చే గ్రాంట్లు, నాలుగు: ఆరోగ్య రంగం మెరుగుదల, స్థానిక సంస్థల నిర్వహణ మెరుగుదల తదితర లక్ష్యాల కోసం ఆర్థిక సంఘం ప్రత్యేకంగా సిఫార్సు చేసిన గ్రాంట్లు. ఈ అన్ని రకాల బదలాయింపులనూ మొత్తంగా లెక్క వేస్తే 2022-23 (సవరించిన అంచనాలు) లో రాష్ట్రాలకు రూ.17.11 లక్షల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్ అంచనాల్లో అది రూ.18.63 లక్షల కోట్లు అయింది. అంటే 8.88 శాతం పెరిగింది. కాని జిడిపి వృద్ధి రేటు 10.5 శాతం కన్నా ఇది తక్కువ కదా.

ఈ విధంగా ఆర్థిక వనరులను కేంద్రీకరించడం మోడీ ప్రభుత్వం హయాంలో యాదృచ్ఛికంగా జరుగుతోందనుకోలేము. ఉన్న పరిమిత వనరుల్లో తమవద్ద ఎక్కువ వాటా ఉండాలన్న తాపత్రయం కొద్దీ చేస్తున్న పని అని కూడా అనుకోలేము. ప్రపంచంలోని ఏ ఫాసిస్టు ప్రభుత్వపు చరిత్ర చూసినా, దాని మౌలిక సిద్ధాంతం కేంద్రీకరణే. మన దేశంలోనైతే ఇది "సహకార ఫెడరలిజం" అనే ముసుగులో అమలు జరుగుతోంది. ఫాసిస్టు ప్రభుత్వాలలో కేవలం సంస్థాగత నిర్మాణం లోనే గాక, ప్రభుత్వ పాలనా వ్యవస్థలోనూ కేంద్రీకరణ అమలు జరుగుతుంది. తమకు అధికారం అప్పజెప్పిన ప్రజలు లేవనెత్తిన డిమాండ్లను పరిశీలించి అమలు జరపడం అనే ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ ఫాసిస్టు ప్రభుత్వాలకు నమ్మకం ఉండదు. ఒకసారి అధికారం చేతిలోకి వచ్చాక ఆ ప్రజల్ని ఏ విధంగా మభ్యపెట్టాలా అన్నదే వారి దృష్టి. అందుకే తరుచూ ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చు రాజేసి ఘర్షణలను రెచ్చగొడుతూ వుంటారు. మైనారిటీ తరగతుల ప్రజలు తమకు శత్రువులు అని మెజారిటీ తరగతుల ప్రజలు నమ్మేటట్టు ప్రచారం చేస్తూవుంటారు. అధికారం తమకు ఏ ప్రజల నుంచి సంక్రమించిందో, ఆ ప్రజలనే నిస్సహాయులుగా మార్చేస్తూ వుంటారు. నాయకుడే సర్వశక్తిమంతుడు అన్న భావనను కలిగించడానికి ప్రయత్నిస్తూంటారు. అందుకే ఫాసిస్టు పాలనలో సమిష్టి నాయకత్వం ఉండదు. అంతేకాదు. ఆ నాయకుడు ప్రజలను ఉద్దేశించి చేసే ప్రసంగాలలో హేతుబద్ధమైన వాదన ఏదీ ఉండదు. ప్రజల చైతన్యాన్ని కదిలించే ప్రయత్నం ఎక్కడా ఉండదు. దానికి బదులు నాటకీయంగా మాట్లాడుతూ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి పూనుకుంటారు.

వనరుల కేటాయింపుల విషయంలో కూడా కేంద్రానికి ఎంత వాటా ఉండాలి? రాష్ట్రాలకు ఎంత వాటా ఉండాలి? అన్న చర్చను హేతుబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిపే ప్రయత్నం ఏదీ ఉండదు. ఏదో ఒక సాకుతో వనరులను కేంద్రీకరించడమే పనిగా వ్యవహరిస్తారు. కేంద్రంలో అధికారం ఫాసిస్టు శక్తుల చేతుల్లో ఉండి, కొన్ని రాష్ట్రాల్లో ఆ ఫాసిస్టు విధానాలకు తలొగ్గని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రతిపక్ష-పాలిత రాష్ట్రాలకు ఊపిరి సలపకుండా చేయడానికి ఈ వనరుల కేంద్రీకరణ పద్ధతిని మరింత ఉధృతంగా అమలు చేస్తారు.

ఈ కేంద్రీకరణ విధానం వెనక మరో బలమైన కారణం కూడా ఉంది. ప్రతీ ఫాసిస్టు ప్రభుత్వానికీ కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థలతో ప్రత్యేకమైన సాన్నిహితం ఉంటుంది. అందుకే ఇటీవల బైటపడిన అదానీ సంస్థల కుంభకోణాల ఉదంతం విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి మౌనాన్ని పాటిస్తోంది. ప్రజా సంక్షేమం కోసం ఆర్థిక వనరులను వికేంద్రీకరించే బదులు కేంద్రీకరిస్తే ఆ నిధులను తన అభిమాన గుత్త సంస్థలకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయడానికి వీలౌతుంది.

ఈ ఏడాది బడ్జెట్ ఇందుకు సరైన మచ్చుతునక. కరోనా మహమ్మారి నుండి కోలుకున్నప్పటికీ, ప్రైవేటు వ్యక్తుల వినిమయం బాగా కుదించుకుపోయింది. ఇది అనేకమంది ప్రజలను దుర్భర దారిద్ర్యం లోకి నెట్టింది. వారిని ఆ పరిస్థితి నుండి బైట పడవేయడానికి కావలసిన ఏ చర్యలూ ఈ బడ్జెట్ లో లేవు. జిడిపి వృద్ధి రేటు కన్నా కూడా తక్కువ స్థాయిలోనే ప్రభుత్వ వ్యయాన్ని ఉండేలా పరిమితం చేశారు. కాని అదే సమయంలో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకోసం కేటాయింపులు బాగా పెంచారు. ఈ ప్రాజెక్టులలో అదానీ గ్రూపుకి ప్రత్యేకమైన ఆసక్తి ఉండడమే దీనికి కారణం. వాటిలో కొన్ని ప్రాజెక్టులలో ప్రభుత్వానికి తోడు భాగస్వామిగా అదానీ గ్రూపు ఉంటుంది. మరి కొన్నింటికి ఇన్‌పుట్స్‌ను సరఫరా చేస్తుంది. అదానీ సంస్థలకు కావలసిన మార్కెట్‌ను సృష్టించడానికే ఈ బడ్జెట్ కేటాయింపులన్నీ తోడ్పడతాయి.

ఆర్థిక వనరులను కేంద్రం గుప్పెట్లో పెట్టుకునే ధోరణి ఒక్క ఫాసిస్టు ప్రభుత్వాలకే ఉంటుంది అని అనుకోలేం. గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలన్నింటికీ ఈ లక్షణం ఉంటుంది. ప్రజల నుండి పోగేసిన వనరులను ప్రైవేటు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం వెచ్చించాలన్నదే వాటి విధానం. అలా కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడం అంటే అది వారి దృష్టిలో "సంపదను వృధాగా ఖర్చు చేయడమే." ఈ ధోరణి ఫాసిస్టు ప్రభుత్వాలు వున్నప్పుడు మరింత ప్రకోపిస్తుంది. ప్రజల్ని మత విద్వేష రాజకీయాలలో ముంచెత్తి తమ భౌతిక జీవితంలో మెరుగుదల గురించి ఆలోచించకుండా వారు ఉండేలా చేస్తూ మరోపక్క తమకు నచ్చిన గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం ఆర్థిక వనరులను మళ్ళిస్తారు. మోడీ ప్రభుత్వం ఈ కేంద్రీకరణను తారాస్థాయికి తీసుకుపోతున్నది.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాఖ్య

కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యం రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ వస్తోంది. ఆయుష్‌ను కలుపుకుని ఆరోగ్య రంగానికి 2023-24 బడ్జెట్‌లో రూ.92,803 కోట్లు కేటాయించగా, 2022-23లో రూ.89,251 కోట్లు కేటాయించింది. ముందుటేడాది కంటే రూ.3,552 కోట్లు పెంచినట్లు కన్పించినా, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేటాయింపులు రెండు శాతం తగ్గాయి. ఈ ఆరోగ్య ఖర్చులు జిడిపిలో 0.3 శాతం, బడ్జెట్‌లో 2 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. ఈ కేటాయింపుల కోతను పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వానికి సామాన్య ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ, బాధ్యత లేదన్నది స్పష్టమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆ దేశ జిడిపిలో కనీసంగా ఐదు శాతం ఆరోగ్యానికి కేటాయించాలని సూచించింది. కానీ ప్రభుత్వం ఏనాడూ ఆ దిశగా బడ్జెట్ కేటాయించలేదు.

ఆరోగ్య రంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం




'జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్' (ఎన్‌హెచ్ఎంపి)కు కేటాయింపుల తగ్గుదల పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రభావం చూపుతుంది. మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ఇతర కీలక అంశాలను ప్రస్తుత బడ్జెట్‌లో విస్మరించింది. ప్రధానమంత్రి మాతృవందన యోజన వంటి పథకాలకు 2022-23లో రూ.2,622 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2023-24లో రూ.2,582 కోట్లకు కుదించింది. అంగన్వాడీ, పోషణ్ వంటి పథకాలకు పరిమితంగా రూ.291 కోట్లు కేటాయించింది. ఈ పథకంలోనే అంగన్వాడీ సేవలు, పోషణ అభియాన్, కౌమార బాలిక పథకం, జాతీయ శిశు సంరక్షణ పథకం వంటి ముఖ్యమైనవి వున్నాయి. ప్రభుత్వం ఐసిడిఎస్‌కు చేసిన కేటాయింపులను 2014-15తో పోల్చిచూసినప్పుడు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. 'జాతీయ ఆరోగ్య మిషన్'కు రూ.1438 కోట్లు కేటాయింపులు తగ్గాయి. ఎన్‌హెచ్ఎంకు కేటాయింపులు తగ్గడంతో రాష్ట్రాలకు బదిలీ చేసే నిధులు తగ్గనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఆరోగ్య సేవలు పేద కుటుంబాలకు అందని పరిస్థితి ఏర్పడనుంది. సురక్షిత మాతృత్వం, యూనివర్సల్ టీకా, వివిధ వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలపై నిధుల కోత ప్రభావం పడనుంది.

ఆరోగ్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత తగ్గుతున్నది. పరిశోధన రంగానికి ఆరోగ్య బడ్జెట్‌లో మూడు శాతం కేటాయించింది. 2020-21లో ఆరోగ్య పరిశోధనల వాస్తవ వ్యయం 3.8 శాతం కాగా, ఈ బడ్జెట్‌లో 3.1 శాతానికి తగ్గింది. కోవిడ్ వ్యాక్సిన్లతో పాటు పలు ఆరోగ్య పరిశోధనలను చేపట్టిన ఐసిఎంఆర్‌కు నిధులు తగ్గించింది. 2021-22లో ఐసిఎంఆర్‌కు రూ.2,358 కోట్లు, 2022-23 రూ.2,198 కోట్లు కేటాయించింది. 17 శాతం నిధులు పరిశోధనలపై తగ్గించింది. ఈ ఏడాది కేటాయింపులు రూ.2359 కోట్లు. 2021-22 నాటి కేటాయింపులకు సమానంగా వుంది.

కోవిడ్ కాలంలో ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పిఎమ్‌జెఎవై) పథకం పేద, అణగారిన వర్గ ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో ఘోరంగా విఫలమైంది. బీమా చెల్లింపులలో గణనీయమైన తగ్గుదల కనిపించింది. 2021-22లో పిఎమ్‌జెఎవైకు రూ.6,400 కోట్లు కేటాయించి, రూ.3,115 కోట్లు ఖర్చుపెట్టింది. వాస్తవానికి పిఎమ్‌జెఎవై పథకం కింద 75 శాతం చెల్లింపులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నాయి. ప్రయివేటు ఆస్పత్రులకు ప్రజాధనం దోచిపెట్టే పిఎమ్‌జెఎవై పథకం కంటే, ప్రజా ఆరోగ్య వ్యవస్థను పటిష్టపరచడానికి ఆ నిధులు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

జాతీయ టెలీ మెంటల్ హెల్త్ పథకాన్ని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమాలు నిధుల సమస్యతో సరిగా నిర్వహించడంలేదు. 2021-22లో రూ.20.46 కోట్లు ఖర్చు చేసింది. మానసిక ఆరోగ్య పథకాలకు ప్రోత్సాహం లేకపోవడంతో టెలీ మెంటల్ హెల్త్ ప్రారంభ లబ్ధి సమాజంలో కొన్ని ఉన్నత వర్గాలకే పరిమితమైంది. ఎన్‌హెచ్ఎంపి ప్రారంభించిన చాలా ఏళ్ల తరువాత కూడా ఈ అంతరం కొనసాగుతున్నది. ఆయుష్మాన్ భారత్ కింద చేసిన కేటాయింపులలో అధిక భాగం ఖర్చు చేయడంలేదు. పబ్లిక్ హెల్త్ కేర్ డెలివరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. పెద్ద ఐ.టి కంపెనీలు, వాణిజ్య ఆరోగ్య బీమా కంపెనీలకు ప్రయోజనకరంగా ఈ పథకం వుంది.

ఆరోగ్య రంగానికి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు చూస్తే కోవిడ్ పాఠాల నుంచి గుణపాఠం నేర్చుకున్నట్లు లేదు. ప్రపంచ వ్యాపితంగా అనేక మంది శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు రాబోయే ఆరోగ్య ప్రమాదాలపై పలు హెచ్చరికలు, సూచనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ వైద్యాన్ని మరింత ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ విధానాలు కొనసాగిస్తున్నాయి. మహిళలు, పిల్లల ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య పథకాలు, ప్రధాన ఆరోగ్య పరిశోధనా కార్యక్రమాలు కల్గిన ప్రధాన జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్‌ను బలోపేతం చేసే ప్రజారోగ్య వ్యవస్థకు నిధులు పెంచాలి. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపర్చాలి. అప్పుడే ప్రజలకు మేలు.



- టి. కామేశ్వరరావు,
ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్ : 9985250991

విశ్లేషణ

అదానీ అన్నిటికీ అతీతుడా?


(ఆదివారం సంచిక తరువాయి)

స్టాక్ మార్కెట్ లోను, బాండ్ల మార్కెట్ లోను వచ్చిన ఒడిదుడుకుల కారణంగా అదానీ గ్రూపు తన వాటాల అమ్మకాన్ని గాని, డాలర్ డినామినేషన్లలో బాండ్ల అమ్మకాన్ని గాని నిలిపివేయవలసి వచ్చింది. యావత్తు భారతదేశపు పెట్టుబడుల మార్కెట్ విశ్వసనీయత, ఈ దేశపు ఆర్థిక వ్యవహారాల నిర్వహణ విశ్వసనీయత ఈ ఉదంతంతో దెబ్బ తిన్నాయి. మరోవైపు క్రెడిట్ సూయిస్, స్టాండర్డ్ చార్టర్డ్ వంటి రేటింగ్ ఏజన్సీలు వివిధ రకాల చర్యలకు పూనుకుంటున్నాయి. భారత ప్రభుత్వం గాని, ఇక్కడ నియంత్రణ సంస్థలు గాని ఎంత మౌనం పాటించినప్పటికీ ఈ పరిణామాల ప్రపంచవ్యాప్త ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదేదో అదానీ కంపెనీల భవిష్యత్తుకో లేక హిండెన్‌బర్గ్ నివేదికకో పరిమితమైనది కాదు. "ఆ శతకోటీశ్వరుడి భవిష్యత్తు, అతడి వ్యాపార సామ్రాజ్యం భవిష్యత్తు మాత్రమే కాదు. దానికన్నా పెద్ద విషయం ఇప్పుడు పరిశీలనలోఉంది. కార్పొరేట్ వ్యవహారాల నిర్వహణలో భారతదేశపు నిబద్ధత ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. కొద్దిమంది అతి సంపన్నుల చేతుల్లో భారతదేశపు మౌలిక వసతుల రంగం నిర్వహణ చిక్కుకుపోవడం, వారే విదేశీ పెట్టుబడులలో ముందుండడం అనే విధానం ఇప్పుడు భారతదేశ ఆర్థిక నమూనాగా కనిపిస్తోంది." అని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక అభిప్రాయపడింది. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఏ దేశ ఆర్థిక వ్యవస్థా ప్రపంచ దృష్టిని తప్పించుకోజాలదు. హిండెన్‌బర్గ్ నివేదిక కేవలం ఒక సూచిక మాత్రమే.



నీలోత్పల్ బసు

> ఇదేదో అదానీ కంపెనీల భవిష్యత్తుకో లేక హిండెన్‌బర్గ్ నివేదికకో పరిమితమైనది కాదు. "ఆ శతకోటీశ్వరుడి భవిష్యత్తు, అతడి వ్యాపార సామ్రాజ్యం భవిష్యత్తు మాత్రమే కాదు. దానికన్నా పెద్ద విషయం ఇప్పుడు పరిశీలనలో ఉంది. కార్పొరేట్ వ్యవహారాల నిర్వహణలో భారతదేశపు నిబద్ధత ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. కొద్దిమంది అతి సంపన్నుల చేతుల్లో భారతదేశపు మౌలిక వసతుల రంగం నిర్వహణ చిక్కుకుపోవడం, వారే విదేశీ పెట్టుబడులలో ముందుండడం అనే విధానం ఇప్పుడు భారతదేశ ఆర్థిక నమూనాగా కనిపిస్తోంది." అని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక అభిప్రాయపడింది.



ప్రపంచ రేటింగ్ సంస్థలు అదానీ గ్రూపు సంస్థల వ్యవహారాన్ని చాలా లోతుగా పరిశీలిస్తున్నాయి. పైపై కబుర్లతో వాస్తవాలను కప్పిపుచ్చడానికి చూస్తే ఆ సంస్థలు అంగీకరించవు.

అందుచేత తాము అన్నింటికీ అతీతం అన్నట్టు అదానీ ఎంత దబాయించినా, ఆ గ్రూపు సంస్థలకు తక్కిన కార్పొరేట్లు ఎంత సంఘీభావాన్ని ప్రదర్శించినా, తమ స్వంత ధనంతోటో, తోటి కార్పొరేట్ల ధనంతోటో అదానీ గ్రూపు షేర్ల ధరలను పెంచి నిలబెట్టే ప్రయత్నాలు ఎన్ని చేసినా, ప్రపంచవ్యాప్త మదుపుదారుల దృష్టిని తప్పుదోవ పట్టించడం సాధ్యం కాదు. మోడీకి సైద్ధాంతికంగా అత్యంత సన్నిహితుడుగా ఉన్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తమ దేశపు హైఫా ఓడరేవును అదానీకి అప్పజెప్పినా అది కూడా అంతర్జాతీయ మదుపరుల అంచనాలను ప్రభావితం చేయజాలదు.

మోడీ ప్రభుత్వ వైఖరి, గౌతమ్ అదానీతో కుమ్మక్కైన తీరు క్రోనీ క్యాపిటలిజం హద్దుల్ని సైతం అధిగమించి పోయింది. ప్రభుత్వ మౌలిక వసతుల రంగం యావత్తూ అదానీ గ్రూపు సంస్థలకే మొదటి ప్రాధాన్యతగా అప్పగించడం కాకతాళీయం ఏమీ కాదు. "సోలార్ ప్యానెల్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలను స్థాపించాలని ప్రభుత్వం అనుకుంటోందా? ఐతే అందుకు అదానీ సిద్ధంగా ఉన్నాడు. సాంప్రదాయేతర వనరులనుండి విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి పెద్ద లక్ష్యాలను నిర్దేశించాలని ప్రధాని భావిస్తున్నారా? ఐతే ఆ లక్ష్యాలను సాధించడానికి కావలసిన ఒప్పందాలమీద సంతకాలు చేయడానికి అదానీ సిద్ధంగా ఉన్నాడు. ఆయుధాల తయారీలో మనం స్వయంసమృద్ధి సాధించలేకపోతున్నామని ప్రభుత్వం ఆందోళన పడుతోందా? ఐతే అదానీ దేశీయంగా ఇక్కడి పరిస్థితులకు అనువుగా ఉండే రక్షణ వ్యవస్థను 'మేక్ఇన్ ఇండియా' విధానంలో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారు. సెమీ కండక్టర్ల సరఫరా విషయంలో విధాన రూపకర్తలు ఆందోళన పడుతున్నారా? ఐతే అదానీ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, మన దేశ భౌగోళిక-రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఉండే సరఫరా వ్యవస్థను అందించడానికి సిద్ధంగా ఉన్నాడు." అని ఒక బ్లూంబెర్గ్ కాలమిస్టు వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు.

ఇప్పుడు గనుక అదానీ పతనమైతే దాని పర్యవసానాలు మన దేశం మీద కూడా పడతాయి. తన తప్పుల్ని, అవకతవకల్ని కప్పిపుచ్చుకోడానికి, సమర్థించుకోడానికి గౌతమ్ అదానీ ఈ బలహీనతనే వాడుకుంటున్నాడు. అదానీ మీద దాడి అంటే అది భారతదేశం మీద దాడి అని వ్యాఖ్యానిస్తూ బూటకపు దేశభక్తి ముసుగు మాటున దాక్కుంటున్నాడు.

ఆరెస్సెస్ కూడా వెంటనే రంగంలోకి దిగింది. బహిరంగంగా అదానీని సమర్థించడమే గాక, హిండెన్‌బర్గ్ నివేదిక భారతదేశ వ్యతిరేకతతో రూపొందినదంటూ వ్యాఖ్యానించింది. దానికి ఈ దేశంలోని అంతర్గత శత్రువులు తోడ్పాటునిస్తున్నాయంటూ ఆ సందర్భంగా తనకు పుట్టుకనుంచీ అబ్బిన వామపక్ష వ్యతిరేకతను వెళ్ళగక్కింది. గుజరాత్ మారణ హోమం అనంతరం ఏర్పడిన మతతత్వ-కార్పొరేట్ కూటమి మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశాన్ని ఎటువైపు నడిపిస్తోందో ఈ అదానీ ఉదంతం మనకి స్పష్టం చేస్తోంది.

అంతర్జాతీయ పెట్టుబడి పెత్తనంలో, అది ఎటువంటి కుట్రలకు పాల్పడుతూ, ఎప్పటికప్పుడు తన రంగులు మార్చుకుంటూ సాగుతున్నప్పటికీ, ఇది అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమే. అదానీ సంస్థల నిర్వహణ తీరుతెన్నులపైన విచారణ జరిపించాలన్న డిమాండ్ తో, పారదర్శకంగా, చట్టబద్ధంగా వ్యవహారాలు సాగాలన్న డిమాండ్ తో మోడీ ప్రభుత్వం మీద, అది అదానీతో కుమ్మక్కై సహకరించిన తీరు మీద పోరాటం సాగాలి. అందుకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయవలసివుంది. స్వతంత్రమైన ఉన్నతస్థాయి విచారణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ చేసిన విలువైన వ్యాఖ్యలను ఇక్కడ గుర్తు చేసుకుందాం. పారిశ్రామిక పెట్టుబడి ఏ విధంగా పుట్టిందో వివరించిన అధ్యాయం ముగింపులో "తన శరీరంలో తల నుండి కాళ్ళ వరకూ, ప్రతీ రంధ్రం నుంచీ రక్తాన్నీ మురికినీ స్రవిస్తూ పెట్టుబడి పుట్టుకొస్తుంది." అన్నాడు. ఆ తర్వాత "తగు మాత్రపు లాభం వస్తుందంటే పెట్టుబడి చాలా ధైర్యాన్ని ప్రదర్శిస్తుంది. ఓ పది శాతం లాభం గ్యారంటీ అనుకుంటే ఎక్కడైనా పెట్టుబడి పెట్టడానికి తయారౌతుంది. ఒక ఇరవై శాతం లాభం వస్తుందీ అనుకుంటే తెగ ఆత్రుతను ప్రదర్శిస్తుంది. 50 శాతం లాభం వస్తుందంటే మొండిగా బరితెగిస్తుంది. 100 శాతం లాభం కోసం అయితే అన్ని మానవ చట్టాలనూ తొక్కిపారేయడానికి సిద్ధమౌతుంది. ఇక 300 శాతం లాభం గనుక వస్తుందనుకుంటే అది చేయడానికి సిద్ధపడని నేరం అంటూ ఏదీ ఉండదు. దాని బరితెగింపుకు హద్దు ఉండదు. ఆఖరికి తన యజమానిని కూడా ఉరి తీయడానికి అది వెనుకాడదు." అని జోడించాడు. అదానీ ఉదంతం ఆ వ్యాఖ్యను కళ్ళకి కట్టినట్టు చూపిస్తోంది.

(ముగిసింది)

ఇద్దరు పోలీసుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సోమవారం ఉదయం హత్య చేశారు. బోర్డ్‌లాబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మోటారు సైకిల్‌పై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రాకేష్ సింగ్, కానిస్టేబుల్ లలిత్ యాదవ్‌లను రాజనందగాం జిల్లా పరిధిలో సుమారు 15 మంది సాయుధ మావోయిస్టులు అడ్డగించారు. వారిని తుపాకీతో కాల్చి చంపేశారు ఆ తర్వాత మోటారు సైకిల్‌ను దగ్ధం చేశారు. ఈ చర్యకు తామే పాల్పడ్డామంటూ ఎల్‌ఓఎస్ మావోయిస్టు కమాండర్లు దేవచంద్, రానో ప్రకటించారు.

యుపిలో విధాన సభ వద్ద జర్నలిస్టులపై మార్షల్స్ దాడి

- డియుజె ఖండన

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో విధానసభ వద్ద జర్నలిస్టులు, కెమెరామెన్లపై మార్షల్స్ దాడికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం సమాజ్‌వాదీ పార్టీకి చెందిన శివపాల్ యాదవ్, తన పార్టీకి చెందిన మరికొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న చౌదరి చరణ్ సింగ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆ ఆందోళనను కవర్ చేయకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. జర్నలిస్టులు, కెమెరామెన్లపై దాడికి దిగారు. మార్షల్స్ విధి నిర్వహణ అసెంబ్లీకే పరిమితం. వారు అసెంబ్లీలో మాత్రమే విధులు నిర్వహించాలి. ఇలాంటి ప్రాంతాలు పోలీసుల ఆధీనంలో ఉంటాయి. అయినా జర్నలిస్టులపై దాడి చేయడానికి మార్షల్స్ అసెంబ్లీ లోపల నుంచి రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విధానసభ వద్ద జర్నలిస్టులు, కెమెరామెన్లపై మార్షల్స్ దాడిని ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తీవ్రంగా ఖండించింది. ఉద్దేశపూర్వకంగానే మార్షల్స్ ఈ దాడి చేశారని, అందుకు తగిన వీడియో ఆధారాలు ఉన్నాయని డియుజె తెలిపింది. యుపిలోని యోగి ఆధిత్యనాథ్ ప్రభుత్వం అక్రమాలు, దుర్మార్గాలను వెల్లడిస్తున్న జర్నలిస్టులపై వివిధ ఏజెన్సీలు ప్రతీకార దాడులు, విచారణలు, అరెస్టులకు పాల్పడుతున్నాయని డియుజె విమర్శించింది. తాజాగా మీడియా ప్రతినిధులపై జరిగిన భౌతిక దాడిపై డియుజె దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దాడికి పాల్పడిన మార్షల్స్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది.

ఒకే వివాహ వయసు పిటిషన్ తిరస్కరణ

రాజకీయాల్లోని ఏ వర్గాన్నీ సంతోషపెట్టడానికి ఇక్కడ లేం : సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'రాజకీయాల్లోని ఏ వర్గాన్నీ సంతోషపెట్టడానికి మేం ఇక్కడ లేము' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పురుషులు, మహిళలకు ఒకే విధమైన వివాహ వయసు (యూనిఫాం మ్యారేజ్ ఏజ్) ఉండాలని కోరుతూ బిజెపి నేత, న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ప్రస్తుతమున్న చట్టం మహిళలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు వివాహ కనీస వయసుగా నిర్దేశిస్తుంది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనరు స్త్రీ, పురుషులిద్దరికీ వివాహ వయస్సు 21 ఏళ్లుగా ఉండాలని కోరినప్పటికీ, ఈ పిటిషన్‌లోని అభ్యర్థన కొట్టివేయాలని పేర్కొంది. క్రైస్తవులు, పార్సీలు, హిందువులను నియంత్రించే చట్టబద్ధమైన చట్టాలు, ప్రత్యేక వివాహచట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టంలో కనీస వివాహ వయసును 18ఏళ్లుగా కొట్టివేయాలని ఉపాధ్యాయ్ కోర్టును కోరారు. 18 ఏళ్లను కొట్టివేస్తే, 21 ఏళ్లను యూనిఫాం మేరేజ్ ఏజ్‌గా ఉండేలా చట్టం చేయడం లేదా చట్టాలను సవరించడం ద్వారా దానిని అనుసరించలేమని కోర్టు తెలిపింది.

నాగాలాండ్‌లో ఎన్నికల హింస

- ఆరుగురికి గాయాలు, పలు వాహనాలు ధ్వంసం

కోహిమా : త్వరలో అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నాగాలాండ్‌లో ఎన్నికల హింస చెలరేగుతోంది. పలుచోట్ల జరిగిన ఘర్షణల్లో ఆరుగురు గాయపడ్డారు. ఆదివారం మధ్నాహ్నం నోక్‌లక్ జిల్లా థోనోకన్యు అసెంబ్లీ నియోజకవర్గంలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), ఎల్‌జెపి మద్దతుదారుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఐదుగురు గాయపడగా, పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆదివారం సాయంత్రం కిఫిరే జిల్లా థోక్తసూర్ ప్రాంతంలో ఎన్‌పిపి రాష్ట్ర అధ్యక్షులు ఆండ్రూ అహోతో సీమా ప్రచార కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. శనివారం రాత్రి ఇండిసేన్‌లో డిమాపూర్ 2 అసెంబ్లీ నియోజకవర్గ ఎన్‌డిపిపి అభ్యర్థి నివాసంపై దాడి జరిగింది.

నీతి ఆయోగ్ సిఇఓగా సుబ్రమణ్యం

న్యూఢిల్లీ : నీతి ఆయోగ్‌కు నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఓ)గా బివిఆర్ సుబ్రమణ్యంను క్యాబినెట్ కమిటీ ఆన్ అపాయింట్‌మెంట్స్ సోమవారం నియమించింది. ప్రస్తుత సిఇఓ పరమేశ్వరన్ అయర్ స్థానంలో సుబ్రమణ్యంను నియమించారు. పరమేశ్వరన్ అయర్‌ను ప్రపంచబ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించడంతో ఈ నియామకం జరిగింది. సోమవారం మరో ఉత్తర్వుల్లో ఐటిసి లిమిటెడ్ ఛైర్మన్, ఎమ్‌డిగా రాజేష్ రాయ్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

బెంగాల్ ఉద్యోగుల పెన్‌డౌన్

కొల్‌కతా : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డిఎ పెంచాలని డిమాండ్ చేస్తూ పశ్చిమబెంగాల్ ఉద్యోగులు 48 గంటల పెన్‌డౌన్‌ను సోమవారం ప్రారంభించారు. పెన్‌డౌన్‌లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులను లెక్క చేయకుండా ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ఐక్య పోరాట వేదిక 'సంగ్రామి జౌతా మంచా' పిలుపుతో ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొంటున్నారు. రైటర్స్ బిల్డింగ్‌లోని వివిధ శాఖల ఉద్యోగులతో పాటు నూతన సచివాలయం, కోర్టులు, పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర రాజధానితోపాటు సియురి, బీర్భూం, మేదినీపూర్, నదియా, మాల్దా, ముర్షిదాబాద్, హౌరా, హుగ్లీ తదితర జిల్లాల ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొన్నారు. 'కరువు భత్యం క్రమబద్ధీకరణ, అవినీతి రహిత నియామకాల కోసం పెన్‌డౌన్ చేస్తున్నాం. డిఎ మూడు శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేం దిగ్భ్రాంతికి గురయ్యాం. మేం మా ఆందోళనను కొనసాగిస్తాం' అని ఉద్యోగులు చెప్పారు. ఉద్యోగులకు మూడు శాతం డిఎ పెంచుతున్నట్లు ఈ నెల 15న బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 'ఈ పెంపును మేం అంగీకరించం. మేం బిచ్చగాళ్లం కాదు. మా అర్హత ప్రకారం మేం డిమాండ్ చేస్తున్నాం. మేం వెనక్కి తగ్గం' అని ఉద్యోగులు తేల్చిచెప్పారు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, గత కొన్ని రోజులుగా కోల్‌కత్తా నడిబొడ్డున ఉన్న షాహిద్ మినార్ గ్రౌండ్స్‌లో 'సంగ్రామి జౌత మంచా' బ్యానర్‌తో పలువురు ఉద్యోగులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.



48 గంటల పెన్స్‌డౌన్ సందర్భంగా కొల్‌కతాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించండి'

అదానీ-మోడీ సర్కారుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

కోజికోడ్ : 'దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించండి.. అదానీ-మోడీ సర్కారుకు బుద్ధి చెప్పండి' అంటూ భారీ ర్యాలీ కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించారు. కోజికోడ్‌లోని కెల్యాట్టన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగించారు. మోడీ, అదానీ గ్రూపు భారత జాతీయ జాతీయ వాదం పేరుతో అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. 2002లో గుజరాత్ మతమారణ హోమంపై బిబిసి డాక్యుమెంటరీ నిజాలను మరోసారి వెలికితీసిందన్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ జాతీయ వాదం పేరుతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

కేరళలో 'పీపుల్స్ రెసిస్టన్స్ ర్యాలీ' ప్రారంభం

కేరళ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ నేతృత్వంలో సాగే ది పీపుల్స్ రెసిస్టన్స్ ర్యాలీ సోమవారం ప్రారంభమయింది. కసర్‌గాడ్ జిల్లాలోని కుంబ్లాలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఎంవి గోవిందన్ నేతృత్వంలో వచ్చే నాలుగు వారాల పాటు కేరళలోని అన్ని జిల్లాల మీదుగా ఈ యాత్ర సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. యాత్ర ప్రారంభంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ముందస్తు విడుదలకు వారు అనర్హులు

- గోద్రా కేసులో దోషులపై సుప్రీంలో గుజరాత్ ప్రభుత్వ వాదనలు

న్యూఢిల్లీ : గోద్రా రైలు దహనం కేసులో దోషులుగా తేలిన వారు ముందస్తు విడుదలకు అర్హులు కాదని గుజరాత్ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. దోషులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం డి.వై. చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ జె.బి.పార్దివాలా దరఖాస్తుదారుల వయసు, ఎంతకాలం జైలులో ఉన్నారు అనే వివరాలను కోరారు.

దోషులు చేసిన నేరం మరణశిక్షకు తగినదని మెహతా పేర్కొన్నారు. "గుజరాత్ రాష్ట్ర ముందస్తు విడుదల విధానం ప్రకారం, వారు విడుదల చేయబడతారా?" అని సిజెఐ చంద్రచూడ్ ప్రశ్నించారు. టెర్రరిస్ట్ అండ్ డిస్ట్రప్టివ్ యాక్టివిటీస్ (నివారణ) చట్టం కింద అభియోగాలు మోపినందున దోషులు ముందస్తు విడుదలకు అనర్హులని మెహతా అన్నారు.

జాన్ బ్రిట్టాస్‌కు సంసద్ రత్న

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్‌కు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సంసద్ రత్న అవార్డు వరించింది. మరో సిపిఎం మాజీ ఎంపి టికె రంగరాజన్‌కు ఎపిజె అబ్దుల్ కలాం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డు లభించింది. రాజ్యసభ, లోక్‌సభల్లో ప్రశ్నలు, ప్రైవేట్ బిల్లులు, చర్చల్లో పాల్గొనడం, జోక్యాలతో సహ పార్లమెంటరీ కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా సంసద్ రత్న అవార్డును అందజేస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నేతృత్వంలోని జ్యూరీ ఈ అవార్డులను సోమవారం ప్రకటించింది. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనరు టిఎస్ కృష్ణమూర్తి కో-ఛైర్మన్‌గా ఉన్నారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో ప్రారంభించిన పార్లమెంటరీ అవార్డును ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ అమలు చేస్తోంది. రాజ్యసభలో ముగ్గురు ఎంపిలు సంసద్ రత్న అవార్డులకు ఎంపిక కాగా, మొదటగా జాన్ బ్రిట్టాస్ పేరు వచ్చింది. ఎంపిగా పనిచేసిన తొలి ఏడాదిలోనే బ్రిట్టాస్‌కు సంసద్ రత్న అవార్డుల జాబితాలో చోటు దక్కడం విశేషం. జాన్ బ్రిట్టాస్ (సిపిఎం, కేరళ)తో పాటు మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి, బీహార్), ఫౌజియా తహసీన్ అహ్మద్ ఖాన్ (ఎన్‌సిపి, మహారాష్ట్ర)కు సంసద్ రత్న అవార్డులు సిట్టింగ్ సభ్యుల విభాగంలో లభించాయి. రిటైర్డు విభాగంలో ఎంపిలు విశ్వంభర ప్రసాద్ నిషాద్ (ఎస్‌పి, ఉత్తరప్రదేశ్), చాయా వర్మ (కాంగ్రెస్, చత్తీస్‌గఢ్)కు అవార్డులు వరించాయి. లోక్‌సభ ఎంపిలు బిద్యుత్ బరన్ మహతో (బిజెపి, ఝార్ఖండ్), సుకాంత మజుందార్ (బిజెపి, పశ్చిమబెంగాల్), కుల్దీప్ రాయ్ శర్మ (కాంగ్రెస్, అండమాన్ నికోబర్ దీవులు), హీనా విజయకుమార్ గావిట్ (బిజెపి, మహారాష్ట్ర), అధిర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్, పశ్చిమబెంగాల్), గోపాల్ చినయ్య శెట్టి (బిజెపి, మహారాష్ట్ర), సుధీర్ గుప్తా (బిజెపి, మధ్యప్రదేశ్), అమోల్ రామ్ సింగ్ కోలీ (ఎన్‌సిపి, మహారాష్ట్ర)కు సంసద్ రత్న అవార్డులు దక్కాయి.


జాన్ బ్రిట్టాస్


టికె రంగరాజన్

రంగరాజన్‌కు కలాం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డు

వరించింది. ఆయన రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారని జ్యూరీ తెలిపింది. స్టాండింగ్ కమిటీ విభాగంలో వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న రాజ్యసభ ట్రాన్స్‌పోర్ట్, టూరిజం, కల్చరల్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి, బిజెపి ఎంపి జయంత్ సిన్హా ఛైర్మన్‌గా ఉన్న లోక్‌సభ ఆర్థిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అవార్డులు దక్కాయి. మార్చి 25న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు.

మ్యూనిచ్ సదస్సుకు నిరసన సెగ

మ్యూనిచ్: పశ్చిమ దేశాల సైనిక కూటమి నాటోకు, అలాగే ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరాను మరింతగా పెంచేందుకు అది చేస్తున్న యత్నాలకు వ్యతిరేకంగా శాంతి ఉద్యమ కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నాటో 59వ మ్యూనిచ్ భద్రతా సదస్సు బవేరియన్ రాజధానిలో జరుగుతున్న సందర్భంగా ఈ నిరసనలు వెల్లువెత్తాయి. నగరం నడిబొడ్డున పెద్దయెత్తున గుమికూడిన శాంతి కార్యకర్తలు గ్రీకు పురావస్తు పరిశోధన, రోమన్ శిల్పకళ ప్రదర్శన కేంద్రం ఎదురుగా ఉన్న నాలుగు రోడ్ల కూడలి వైపు ప్రదర్శనగా వెళ్లారు. ఉక్రెయిన్‌కు యుద్ధ విమానాలు పంపడాన్ని 64 శాతం మంది జర్మన్ పౌరులు వ్యతిరేకించగా, 23 శాతం మందే సమర్ధించారని స్వతంత్ర మీడియా సంస్థ 'ఫ్రీ బ్లాగ్' సర్వేలో వెల్లడైంది. ఉక్రెయిన్‌కు అధునాతన యుద్ధ విమానాలు సరఫరా చేయడం ఆమోదయోగ్యం కాదని మితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (86 శాతం), వామపక్ష గ్రూపులు (81 శాతం) అభిప్రాయపడినట్లు ఆ సర్వే తెలిపింది. మ్యూనిచ్ భద్రతా సదస్సు ప్రధాన లక్ష్యం నాటో ఆయుధ విధానాన్ని తాజాపరచడం, చైనా, రష్యా వ్యతిరేక వ్యూహానికి మరింత పదును పెట్టడమేనని వెల్లడించింది. ఈ ఏడాది మ్యూనిచ్ భద్రతా సమావేశానికి ఆసియా, ఆఫ్రికా ఖండాల నుంచి రికార్డు స్థాయిలో ప్రతినిధులను ఆహ్వానించింది. అమెరికా ఆధిపత్య వ్యవస్థను సవాల్ చేసే, ప్రశ్నించే దేశాలను బుజ్జగించడంపై దృష్టి పెట్టామని మ్యూనిచ్ సదస్సు చైర్మన్ క్రిస్టాఫ్ హ్యూస్‌జెన్ తెలిపారు.మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్‌తో సహా పలు దేశాల నేతలు హాజరయ్యారు. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థ అసమంగా ఉందని, వర్ధమాన, పేద దేశాల విశ్వాసాన్ని పశ్చిమ దేశాలు చాలా వేగంగా కోల్పోతున్నాయని అన్నారు. ఎక్కువ దేశాల మద్దతు పొందాలంటే ప్రస్తుత గ్లోబల్ ఆర్డర్‌ను పునఃపరిశీలించుకోవాలని వారు అభిప్రాయపడ్డారు.



వేతన సమస్యపై జర్మనీ ఎయిర్‌పోర్టు వర్కర్ల సమ్మెతో బెర్లిన్, మ్యూనిచ్, ఫ్రాంక్‌ఫర్ట్, స్టట్‌గార్ట్, హాంబర్గ్, హనోవర్‌తో దేశమంతటా విమానాశ్రయాలు స్తంభించిపోయాయి. దాదాపు 2,300 దాకా విమానాలు నిలిచిపోయాయి. వేతనాల్లో 10.5 శాతం మేర పెంపుదలను కోరుతూ ఎరియర్‌పోర్టు గ్రౌండ్ సిబ్బంది 24 గంటల వాకౌట్ సమ్మెకు దిగారు.

జెఎన్‌యులో ఎబివిపి గూండాగిరి

- వామపక్ష సంఘాల విద్యార్థులపై దాడి

న్యూఢిల్లీ : జెఎన్‌యులో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) గూండాలు బీభత్సం సృష్టించారు. శివాజీ మహరాజ్ చిత్రపటాన్ని ధ్వంసం చేశారని ఆరోపిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులపై ఆదివారం దాడికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎబివిపి ఆరోపణలను జెఎన్‌యు విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఖండించింది. శివాజీ చిత్రపటం ధ్వంసం ఆరోపణలను తిరస్కరించింది. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఐఐటి బాంబే విద్యార్థి ధర్శన్ సోలంకికి న్యాయం చేయాలని కోరుతూ మార్చ్ చేసిన నేపథ్యంలో ఎబివిపి గూండాలు ఈ దాడికి దిగారని విమర్శించింది. ఈ నెల 12న ఎస్‌సి విద్యార్థి సోలంకి హాస్టల్‌లోని ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. 'ఎబివిపి మరోసారి విద్యార్థులపై దాడికి దిగింది. దర్శన్ సొలంకి తండ్రి పిలుపునకు సంఘీభావంగా క్యాండిల్‌లైట్ మార్చ్ నిర్వహించిన వెంటనే ఇది జరిగింది. కుల వివక్ష వ్యతిరేక ఉద్యమాన్ని అడ్డుకోవడానికి ఎబివిపి ఈ దాడికి పాల్పడింది' అని జెఎన్‌యుఎస్‌యు ఒక ప్రకటనలో తెలిపింది.

ఎబివిపి దాడిని ఖండించిన స్టాలిన్

జెఎన్‌యు విద్యార్థులపై ఎబివిపి గూండాల దాడిని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. తమిళనాడు విద్యార్థులు లక్ష్యంగా ఎబివిపి ఈ దాడికి ప్పాలడిందని స్టాలిన్ విమర్శించారు. 'జెఎన్‌యులో పెరియార్, కార్ల్ మార్క్స్ వంటి నాయకుల చిత్రాలను ధ్వంసం చేయడంతో పాటు, తమిళ విద్యార్థులపై ఎబివిపి చేసిన పిరికిపంద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్శిటీ అధికారులను డిమాండ్ చేస్తున్నాను' అని స్టాలిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిండా ముంచుతున్న అదానీ

(మొదటి పేజి తరువాయి)

అదానీ ప్రయత్నించారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వల్లే అదానీ ప్రపంచ కుబేరుడుగా అవతరించారని తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ఉన్న సమయంలో జరిగిన గోద్రా అల్లర్లలో మోడీకి అదానీ అండగా నిలబడ్డారన్నారు. అందువల్లే ఇప్పుడు అదానీకి మోడీ అండగా ఉంటున్నారని చెప్పారు. మోడీ ప్రధాని కాక మునుపు అదానీ ఆస్తులు రూ.50 వేల కోట్లు కాగా, ప్రధాని అయిన తరువాత రూ.10.30లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. మోడీ ఒత్తిడితో రాష్ట్రప్రభుత్వం అదానీకి దాసోహమయిందని విమర్శించారు. హిండెన్ బర్గ్ నివేదిక వచ్చిన తరువాత రోజునే రాష్ట్ర మంత్రివర్గంలో 406 ఎకరాలు కేటాయిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దీనిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడటం లేదన్నారు. త్వరలో గన్నవరం విమానాశ్రయం కూడా అదానీపరం కానుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ అదానీ మొదట గుజరాత్‌లో వజ్రాల వ్యాపారిగా ఉన్నారని, అప్పట్లోనే కుంభకోణాలు మొదలుపెట్టారని తెలిపారు. దొంగల ముఠాకు అతను గ్యాంగ్ లీడర్ అని విమర్శించారు. దేశ సంపదను మోడీ అతనికి కట్టబెడుతున్నారని తెలిపారు. అదానీకి పరిశ్రమలు అప్పగించాలని నరేంద్రమోడీ పారిశ్రామిక వేత్తలపై ఒత్తిడి తేస్తున్నారని, వినకపోతే ఐటి, ఇడి దాడులు ప్రయోగిస్తున్నారని తెలిపారు.

జివికెను బెదిరించి ఢిల్లీ విమానాశ్రయాన్ని, నవయుగను బెదిరించి కృష్ణపట్నం పోర్టును అప్పగించారన్నారు. విశాఖలో ఉన్న ప్రభుత్వరంగ పోర్టును నిర్వీర్యం చేసి అదానీ ఆధ్వర్యంలో ఉన్న గంగవరం పోర్టు ద్వారా ఐఒసి, ఉక్కు, ఎగుమతి, దిగుమతి ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు. ఎపి సముద్ర తీరాన్ని అదానీకి అప్పగించే అవకాశం కూడా ఉందన్నారు. ప్రజలను చైతన్యపరిచి మోడీ, అదానీ విధానాలను వివరించాలన్నారు.

విద్యార్హతల ఆధారంగా ఓటు వేసేది కేరళలోనే.. : సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఒక్క కేరళలోనే అభ్యర్థి విద్యార్హతల ఆధారంగా ఓటు వేస్తారని, మరెక్కడ అలా ఉండదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి బిజెపికి చెందిన హర్షవర్ధన్ బాజ్‌పేయి ఎన్నికను అనర్హతగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. దేశంలో ఎన్నికల విషయానికి వస్తే, అభ్యర్థుల విద్యార్హతల ఆధారంగా ఓటు వేయడం కేరళ రాష్ట్రంలో తప్ప, మిగతా ఎక్కడా ఉండదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. చాలా మంది ఓటర్లు ఓటు వేసే ముందు అభ్యర్థి విద్యార్హత గురించి చూడరని ధర్మాసనం పేర్కొంది. 'మన దేశంలో విద్యార్హతల ఆధారంగా ఎవరూ ఓటు వేయరు' అని జస్టిస్ జోసెఫ్ అన్నారు. వెంటనే 'కేరళలో తప్ప' అని జస్టిస్ నాగరత్న జోడించారు. 2007, 2012, 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ పత్రాలతోపాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లలో సరైన విద్యార్హతలు, బాధ్యతలను వెల్లడించకుండా బాజ్‌పేయి అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనుగ్రహ్ నారాయణ్ సింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎంపి అసదుద్దీన్ ఒవైసి ఇంటిపై రాళ్లదాడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. ఢిల్లీలోని తన ఇంటిపై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేశారని, ఈ దాడిలో ఇంటి కిటికీలు దెబ్బతిన్నాయని ఢిల్లీ పోలీసులకు అసదుద్దీన్ ఒవైసి ఫిర్యాదు చేశారు. 2014 నుంచి తన ఇంటిపై అగంతకులు రాళ్ల దాడి చేస్తున్నారని, ఆదివారం రాత్రి జరిగిన ఈ రాళ్ల దాడి నాలుగో ఘటన అని అసదుద్దీన్ ఒవైసి ట్వీట్ చేశారు. ఆదివారం రాత్రి తాను జైపూర్ నుంచి ఢిల్లీ ఇంటికి 11:30 గంటలకు తిరిగి రాగా.. రాళ్ల దాడి జరిగినట్లు పనివాళ్లు చెప్పారని, ఈ దాడిలో పలు కిటికీలు పగిలిపోయాయని ఎంపి అసదుద్దీన్ ఒవైసి తన ఇంట్లోని దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ దాడి ఆదివారం సాయంత్రం 5:30 గంటల నుంచి 6 గంటల వరకు జరిగిందని అన్నారు. ఎంపి ఫిర్యాదుతో ఢిల్లీలోని అశోకా రోడ్డులో ఉన్న అసద్ ఇంటిని ఢిల్లీ డిసిపి సందర్శించి రాళ్ల దాడి ఆధారాలు సేకరించారు.



సోలంకి ఆత్మహత్యపై బాంబే ఐఐటి వద్ద ధర్నా

ముంబై : దళిత విద్యార్థి దర్శన్ సోలంకి ఆత్మహత్య సంస్థాగత హత్య అని, బాంబే ఐఐటి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఇక్కడి మెయిన్ గేట్ వద్ద సోమవారం ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు, ఐద్వా, జెఎఎస్‌ఎస్ ఆధ్వర్యాన ఆందోళన చేశారు. దర్శన్ సోలంకిని ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిని అరెస్టు చేయాలని, వారిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దర్శన్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరారు.

డీలర్ల నుంచి ఛార్జీలు వసూలు వద్దు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రేషన్ షాపుల వద్ద సరుకు దించినందుకు డీలర్ల నుంచి హమాలీలు ఛార్జీలు వసూలు చేయరాదని హైకోర్టు ఆదేశించింది. రేషన్ షాపుల దగ్గర సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తే అందుకు ఛార్జీలు వసూలు చేయరాదన్న 2019 నాటి పౌర సరఫరాలశాఖ కమిషనర్ సర్క్యులర్ అమలు చేయాలంది. తాము తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని జస్టిస్ రవినాథ్ తిల్హారీ మధ్యంతర ఆదేశాలిచ్చారు. రేషన్ షాపుల వద్ద హమాలీలు సరుకు దించినందుకు చెల్లించాల్సిన ఛార్జీల వ్యవహారంపై టెండర్లు జారీ చేయడాన్ని చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సవాల్ చేసిన పిటిషన్‌పై విచారణను మార్చి 16కు హైకోర్టు వాయిదా వేసింది.

సిజె బెంచ్‌కు కాపు రిజర్వేషన్ల కేసు

రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పనకు వీలుగా ప్రభుత్వం గత చట్టాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్ ప్రజాహిత వ్యాజ్యమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిల్‌ను చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌కు నివేదించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. సోమవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు ఈ ఆదేశాలను జారీ చేశారు.

గన్నవరంలో తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజి తరువాయి)

కార్లను ధ్వంసం చేశారు. వాహనాలపై విసిరిన రాళ్లు గురితప్పి దాడిని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులపైనా పడ్డాయి. ఈ దాడిలో సిఐ కనకరావుతోపాటు ఐదుగురు కానిస్టేబుళ్లకు, వార్తా సేకరణకు వెళ్లిన ప్రజాశక్తి గన్నవరం విలేకరి ఎస్.శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్ వద్ద పట్టాభి ఉన్నారని తెలుసుకున్న వంశీ అనుచరులు అటుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈలోగా స్టేషన్ నుంచి పార్టీ కార్యాలయానికి వస్తున్న టిడిపి నేతలు మార్గమధ్యలో వంశీ అనుచరులకు ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య తీవ్ర స్థాయిలో వివాదం జరిగింది. పట్టాభి కారుపై వైసిపి శ్రేణులు దాడికి ప్రయత్నించాయి. పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం అక్కడ ఆందోళనకు దిగిన పట్టాభిని పోలీసులు అరెస్టు చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

టిడిపి కార్యాలయంపై దాడి నేపథ్యంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి ఇరువైపులా టిడిపి, వైసిపి శ్రేణులు మోహరించాయి. అప్సర థియేటర్ సమీపంలో ఇరుగ్రూపులూ రాళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నాయి. పోలీసులు ఇరుగ్రూపులనూ చెదరగొట్టారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మరోసారి మరింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం జాతీయ రహదారిపై టిడిపి నాయకులు బైఠాయించారు. దీంతో, మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని చెదరగొట్టారు. గన్నవరం నియోజకవర్గంలో వైసిపి, టిడిపి నేతల మధ్య గత కొన్ని రోజులుగా మాటల యుద్ధం సాగుతోంది. పరస్పరం వ్యక్తిగత విమర్శలు చేసుకుంటున్నారు. ఖాతాదారులను మోసగించిన 'సంకల్ప సిద్ధి'కి, ఎంఎల్‌ఎ వల్లభనేనికి సంబంధం ఉందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గతంలో ఆరోపించారు. దీనిపై ఎంఎల్‌ఎ కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. టిడిపి అధినేత చంద్రబాబుపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. టిడిపి నేతలు కూడా మాటల దాడికి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది.

సిపిఎం ఖండన

ఈ ఘటనను సిపిఎం గన్నవరం మండల కమిటీ ఖండించింది. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, దాడులు తగవని పేర్కొంది. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతూ దాడులకు పాల్పడడాన్ని నియోజకవర్గ ప్రజలు సహించరని పేర్కొంది.

వైసిపి అరాచకాలపై గవర్నరు జోక్యం చేసుకోవాలి : చంద్రబాబు

రాష్ట్రంలో వైసిపి అరాచకాలపై రాష్ట్ర గవర్నరు తక్షణమే జోక్యం చేసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై జరిగిన దాడిని, వాహనాలను తగలబెట్టిన ఘటనను సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. సిఎం ఫ్యాక్షనిస్టు మనస్తత్వానికి ఈ ఘటనలే ఉదాహరణని విమర్శించారు. వైసిపి ఉన్మాదులు అరాచకాలు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గవర్నర్ జోక్యం చేసుకొని కారకులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై డిజిపికి చంద్రబాబు లేఖ రాశారు. టిడిపి నేతలు దొంతు చిన్నా, పట్టాభిరామ్ భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టాభిరామ్‌ను పోలీసులు కిడ్నాప్ చేశారని చంద్రబాబు ఆరోపించారు. టిడిపి కార్యాలయంపై దాడిని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, టిడిపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు టిడిపి మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు ఖండించారు.




మీకోసం

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో నాలుగు ఎండు మిరపకాయలు వేసి ఉంచాలి.

జీవన సౌరభం

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

ఉత్తరం




ఓనాడు పోస్ట్‌మేన్ పాఠశాలకు వచ్చాడు. ఉత్తరాలు ఇస్తూ రెండు రూపాయలు బకాయి ఉందని చెప్పాడు. ఆ మాటలకు ప్రధానోపాధ్యాయుడు వెంకటరావుకు కోపం వచ్చింది. ముక్కుసూటిగా వెనక్కి తిప్పి పంపేయండి అని చెప్పారు. కాని గుమస్తా మాత్రం ఆ పోస్ట్‌మేన్‌కు రెండు రూపాయలు ఇచ్చాడు. దాంతో ఆయన పాఠశాలకు వచ్చిన ఉత్తరాలు ఇచ్చాడు. ఎవరో పాఠశాలకు ఉత్తరం రాసినట్లు అనిపించి ఆతృతగా చించి చదవసాగాడు గుమస్తా. దానిలో ఇలా రాసి ఉంది.

'గౌరవనీయులైన ప్రధానోపాధ్యాయులు గారికి, నేను మీ పాఠశాల పూర్వపు విద్యార్థిని. ప్రస్తుతం మంచి ఉన్నత స్థానంలో ఉన్నాను. నాకు మంచి చదువునిచ్చిన మన పాఠశాలకు కృతజ్ఞతగా ప్రతి ఏటా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు చెరో అయిదు వేల రూపాయలు ఇవ్వాలని అనుకుంటున్నాను. అనుమతించగలరు. ఇట్లు మీ శిష్యుడు ఆనంద్.' అని ఉంది.

గుమస్తా తను చేసి పనిని క్షమించమంటూనే ఆ ఉత్తరాన్ని ప్రధానోపాధ్యాయుడు చేతిలో ఉంచాడు. అది చదివి, తన కోపం వల్ల ఎంత మంచి అవకాశాన్ని చేజార్చుకున్నారో అర్థమైంది. వెనక్కి పంపి ఉంటే పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి తన కోపం ఆటంకయ్యేదని ఊహించుకున్నారు. అన్ని సందర్భాలోనూ కోపం పనికి రాదని గ్రహించారు. వెంటనే గుమస్తాకి కృతజ్ఞతలు తెలియజేస్తూ శిష్యునికి అనుమతి ఇస్తూ జవాబు పంపారు.

- మార్లపూడి ఆనందకుమార్
94903 58767



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ




- డి. కుమారి,
8వ తరగతి,
జెడ్.పి.హెచ్ స్కూలు,
ఉప్పలపాడు,
అనంతసాగరం మండలం,
నెల్లూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్కూలులోనే ఉంటూ .. విద్యాబోధన



పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో టీచర్ జాన్సన్‌కి బాగా తెలుసు. అందుకే కొండల్లో, సుదూర ప్రాంతంలో నివసించే పేద పిల్లలకు చదువు దూరం కాకూడదనుకున్నాడు. ఆ స్కూలుకు వచ్చిన ప్రతి టీచరూ బదిలీ చేయించుకుని వెళుతుంటే.. తాను మాత్రం ఆ పాఠశాలోనే ఉంటూ పిల్లలకు చదువు చెబుతున్నారు. చదువు ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ... విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేస్తున్నారు.

తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన జాన్సన్ 14 ఏళ్ల నుంచి ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడాది మార్చిలో ఆయనకు కదంబకుట్టై గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయింది. అది కొండల్లో ఉన్న చిన్న పల్లెటూరు. ఎలాంటి సదుపాయాలూ అక్కడ లేవు. ఆ ఊరికి చేరుకోవాలంటే ఎటువంటి వాహన సౌకర్యం ఉండదు. మెయిన్ రోడ్డు నుంచి కొండల మధ్యగా 2.5 కి.మీ. నడవాలి. కావాల్సిన సరుకులు దొరకవు. జాన్సన్ నివాసం ఉంటున్న ఊరి నుంచి 60 కి.మీ. ప్రయాణించాలి. తను అంత శ్రమించి ఆ ఊరికి చేరితే... స్కూల్లో ఉంది 9 మంది విద్యార్థులు. ఇన్ని ఇబ్బందులు ఉన్న ఈ ఊరికి ఏ టీచర్ వచ్చినా వెంటనే బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. లేదా లాంగ్ లీవ్ తీసుకుని, రెండు నెలలకో, మూడు నెలలకో వచ్చిపోతుంటారు. దాంతో ఆ పాఠశాలకు వచ్చిన పిల్లల హాజరు శాతం క్రమంగా తగ్గిపోతుంది. ఉన్న పిల్లలకు చదువు పెద్దగా అబ్బలేదు.

ఆ ఊరిలో గిరిజన కుటుంబాలే ఎక్కువ. పిల్లల్ని ఖాళీగా ఇంటి దగ్గర ఉంచడం దండగ అని తల్లిదండ్రులు తమతో పాటు పనికి తీసుకెళుతున్నారు. చాలామంది ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేశారు. తమ పిల్లలకు చదువు చెప్పే టీచర్లు ఎవరూ రావడం లేదని, వచ్చినా మధ్యలోనే వదిలేసి వెళ్లిపోతున్నారని ఊరి పెద్దలకు, తల్లిదండ్రులకు గట్టి అభిప్రాయం ఏర్పడింది. ఇదంతా జాన్సన్‌కు ఆ పాఠశాలకు వచ్చిన మొదటి రోజే అర్థమైంది. తానూ కొన్ని నెలలు ఉండి బదిలీ చేయించుకుని వెళ్లాలనుకున్నాడు. కాని



స్కూలుకు వచ్చిన తొమ్మిది మంది విద్యార్థులతో మాట్లాడిన తరువాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు.

ఏ టీచర్ వచ్చినా కొద్ది రోజులు కనిపించి, వెళ్లిపోవడంతో చదువుకోవాలన్న ఆసక్తి చాలామంది పిల్లల్లో క్రమంగా తగ్గిపోతోంది. 'మాకు చదువు చెప్పండి. మేము బాగా చదువుకుని.. పెద్ద ఉద్యోగాలు చేయాలనుకుంటున్నాం. మా ఊరిని మేము బాగుచేసుకోవాలి. ఊరికి అన్ని సదుపాయాలూ కల్పించాలి. అదే మా లక్ష్యం.' అక్కడి పిల్లలు మాస్టారిని అభ్యర్థించారు. దాంతో ఆయన మనసు కరిగిపోయింది. పిల్లల ఆవేదన, ఆకాంక్ష తన ఆలోచనని మార్చివేశాయి.


ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ పిల్లల చదువు ఆగకూడదనుకున్నాడు. ఇప్పుడు ఆ స్కూల్లోనే నివాసం ఉంటున్నాడు. తన కుటుంబం ఉన్న హుసూర్‌కు వారంలో ఒక రోజు వెళ్లి వస్తున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు రెండు రోజులకు సరిపడా ఆహారం, మిగిలిన మూడు రోజులకు సరిపడా సరుకులు తెచ్చుకుని, వండుకుంటున్నాడు. రాత్రి వేళల్లో ఏనుగులు, పాములు ఆ స్కూలు పరిసరాల్లో సంచరిస్తూ ఉంటాయి. అయినా ఆయన స్కూలు వదిలి వెళ్లకుండా పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాడు. స్కూలు వదిలిన తరువాత కూడా పిల్లలకు దగ్గరుండి చదివిస్తున్నాడు. డ్రాపౌట్స్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లల్ని స్కూలుకు తిరిగి రప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. బాల్య వివాహాలు మంచివి కాదని వివరిస్తున్నాడు. ఆ గ్రామానికి అరకిలో మీటరు దూరంలో వీరబద్రన్ కొట్టాయ్ తండా ఉంది. జాన్సన్ అక్కడికి వెళ్లి పిల్లల్ని స్కూలుకు పంపిచమని కోరి, వారు వచ్చేలా చేస్తున్నాడు. స్కూలుకు రాని పిల్లలకు సాయంత్రం ఇళ్ల దగ్గరకు వెళ్లి పాఠాలు చెబుతున్నాడు. దాంతో అక్కడ పిల్లల చదువులో మార్పు వచ్చింది. కొద్ది నెలల్లోనే అక్షరాలు నుంచి వాక్యాలు చదివే స్థాయికి తమ పిల్లలు రావడం తల్లిదండ్రులు గమనించారు.

పాఠశాల్లో ఉన్న సమస్యలను అధికారులకు వివరించి, బోధనా సామగ్రిని పంపించమని కోరాడు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, ఇతర సౌకర్యాలు కల్పించమని అభ్యర్థిస్తున్నాడు. తమ ఊరిలో ఓ ఉపాధ్యాయుడు స్థిరంగా ఉండటం చూసి తల్లిదండ్రులు హర్షిస్తున్నారు. పిల్లలకు చదువు చెప్పాలన్న జాన్సన్ పట్టుదల చూసి అధికారులు, ఊరి ప్రజలు తగిన సహకారం అందిస్తున్నారు.

విటమిన్ సి .. ఇప్పుడు చాలా అవసరం!

వేసవికాలంలో విటమిన్ సి లభించే ఆహారం తీసుకోవడం మన శరీరానికి చాలా అవసరం. చెమట రూపంలో బయటకు వెళ్లిపోయిన విటమిన్ సి వల్ల డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి ఈ సమయంలో విటమిన్ సి పదార్థాలు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల వైరస్, క్రిములు, సూక్ష్మజీవులను తట్టుకునే శక్తి శరీరానికి ఉంటుంది. ఉసిరి, నిమ్మకాయలు లాంటి పుల్లటి పండ్లలోనే కాక ఇతర పండ్లలో కూడా విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. ఏయే పండ్లలో విటమిన్ సి ఉంటుందో తెలుసుకుందాం.

- కమలాఫలం, బత్తాయి పండ్లు, యాపిల్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది.
- పుచ్చకాయ, బొప్పాయి, ద్రాక్షపండ్లలో కూడా విటమిన్ సి అధికంగా ఉంటుంది.
- కివీ తింటే విటమిన్ సితో పాటు మరికొన్ని విటమిన్లు శరీరానికి అందుతాయి.
- జామకాయ, పైనాపిల్, మామిడి పండ్లు, బ్రకోలి లాంటివి రోజూ కనీసం ఒకటి చొప్పున ఈ కాలంలో తింటే రోగనిరోధక శక్తి మెరుగ్గా ఉంటుంది.
- వీటితో పాటు ప్రతిరోజు ఉదయాన్నే తులసి ఆకులు తింటే ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది.
- అలాగే తేనె, నిమ్మరసం రోజూ ఉదయాన్నే తాగినా, అరటి పండ్లు తిన్నా ఆ రోజుకు శరీరానికి సరిపడా రోగనిరోధకశక్తి అందుతుంది.
- కేవలం పండ్లలోనే కాకుండా బ్రోకలీ, కాలీఫ్లవర్, మొలకలలో కూడా విటమిన్- సి సమృద్ధిగా లభిస్తుంది.
- అలాగే కూరల్లో కారం పొడికి బదులుగా పచ్చిమిర్చి వాడితే మంచిది. పచ్చి మిరపకాయల్లో విటమిన్ సితో పాటు ఐరన్ అధికంగా ఉంటుంది.






ఎన్‌టిఆర్ 30 ప్రారంభం వాయిదా

కొరటాల శివ, ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న ఎన్టీఆర్ 30 సినిమా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఫిబ్రవరి 24న ప్రారంభం కావడంలేదు. నందమూరి తారకరత్న మరణంతో సినిమా ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. కొత్త తేదీని తరువాత ప్రకటిస్తామని మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని 2024 ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

'నో ఎంట్రీ' ట్రైలర్ విడుదల



అటవీ నేపథ్యంలో రూపుదిద్దుకున్న 'నో ఎంట్రీ' చిత్రంలో ఆండ్రియా జెరెమియా సరికొత్త పాత్రలో నటిస్తోంది. ఎంతో సాహసంతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ పాత్ర ఇది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా 'నో ఎంట్రీ' మూవీ నుండి ట్రైలర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. దట్టమైన అటవీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్ళిన కొంత మంది స్నేహితులు అడవిలోని కొండ శిఖరంలో ఉన్న లగ్జరీ విల్లాలో బస చేస్తారు. ఆ ఇంటిని క్రూరమైన అడవి కుక్కలు చుట్టుముడతాయి. ఆ కుక్కల బారి నుండి వారు ఏ విధంగా తప్పించుకున్నారనే విషయాలు ట్రైలర్‌లో చూపించారు. జంబో సినిమాస్ బ్యానరులో శ్రీధర్ అరుణాచలం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆర్. అళగు కార్తీక్ దర్శకత్వం వహించారు. అదవ్ కణ్ణదాసన్, రన్యా రావ్, మానస్, జయశ్రీ, జాన్వీ ఇతర కీలకపాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం తెలుగు, తమిళ భాషలలో విడుదలకానుంది.

ఇకపై నా జీవితం సినిమాకే..



'రెండు పడవల ప్రయాణం నా వరకు సరిపడదని నాకనిపించింది. అందుకే నాకు ఎంతో ఇష్టమైన సినిమా రంగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తున్నా' అంటున్నారు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసిన ఆయన 'చీమ - ప్రేమ - మధ్యలో భామ!' చిత్రంతో దర్శకుడిగా మారి తొలి చిత్రంతోనే తన ప్రతిభను ప్రకటించుకున్నారు. మాగ్నం ఓపస్ ఫిలింస్ పతాకంపై రూపొందిన ఈ వినూత్న ప్రేమకథా చిత్రం అమెరికా, కెనడా, ఫ్రాన్స్, లండన్ తదితర దేశాల ఫిల్మ్ ఫెస్టివల్స్ లో బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ అవార్డులు గెలుచుకుంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ తన నిర్ణయం గురించి ప్రేక్షలకు తెలియజేశారు. సినిమా రంగంలోకి ప్రవేశించే ముందు కొన్ని షార్ట్ ఫిలింస్ చేసి, ఫిల్మ్ మేకింగ్ పట్ల పరిపూర్ణమైన అవగాహన తెచ్చుకున్నారు. 'మై కౌబాయ్, ఎందుకిలా, టేక్ ఇట్ ఈజీ వంటి షార్ట్ ఫిల్మ్స్ చేశారు. 'శ్రీకాంతరంగం' పేరుతో రాసుకున్న పుస్తకంలో తన అంతరంగాన్ని ఆవిష్కరించుకున్న ఈయన ద్వితీయ చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతూనే, తన మూడో చిత్రం కోసం కూడా సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇక నుంచి సినిమాలు తీసేందుకు సమయాన్ని కేటాయిస్తానని చెప్పుకొచ్చారు.



వారి ధైర్యాన్ని ప్రశంసిస్తా
ఆలియా భట్

ఏ రంగంలోనైనా ధైర్యంగా ముందడుగు వేసే మహిళలను ప్రశంసిస్తానని అంటున్నది బాలీవుడ్ తార ఆలియా భట్. వ్యాపారవేత్తలుగా మారిన తోటి నాయికలకు తన వంతు సహకారం ఉంటుందని ఆలియా చెప్పింది. ఇటీవల బాలీవుడ్ నాయికలు సినిమాల్లో నటిస్తూనే తమ సొంత ఫ్యాషన్, స్కిన్‌కేర్ బ్రాండ్స్ ప్రారంభిస్తున్నారు. ప్రియాంక చోప్రా, దీపికా పడుకోన్ ఎంతోమంది హీరోయిన్లు వ్యాపారరంగంలో అడుగుపెట్టారు. దీపికా పడుకోన్ 'ఆల్ అబౌట్ యు' అనే ఫ్యాషన్ బ్రాండ్ స్థాపించగా, కత్రీనా కైఫ్ 'కే బ్యూటీ' అనే స్కిన్ కేర్ బ్రాండ్ మీద అమ్మకాలు చేస్తున్నది. ఇటీవల బిడ్డకు జన్మనిచ్చిన ఆలియా భట్ 'ఎడ్ ఎ మమ్మా' అనే దుస్తుల కంపెనీ బ్రాండ్ ఆరంభించింది. 'నాతో సహా తోటి నాయికలు చాలా మంది ఫ్యాషన్, స్కిన్‌కేర్ వ్యాపారవేత్తలుగా మారారు. వాళ్ల కోసం వీలైనంత ప్రచారం చేస్తా. నేను సపోర్ట్ చేస్తున్నది వారు కేవలం మహిళలు అని కాదు ..కొత్త పనిని మొదలుపెట్టే వారి ధైర్యాన్ని ఇష్టపడతాను.' అని చెప్పింది.

'మా ఊరి పొలిమేర' సీక్వెల్ పూర్తి

సత్యం రాజేష్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'మా ఊరి పొలిమేర' సినిమా సీక్వెల్ చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్రానికి డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. గౌరికృష్ణ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉత్తరాఖండ్, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఖమ్మం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిపామని, అందరిని ఆకట్టుకునే వినూత్నమైన కథ ఇదని చిత్రబృందం పేర్కొంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.



సెమీస్‌కు అమ్మాయిలు

ఐర్లాండ్‌పై ఐదు పరుగుల తేడాతో గెలుపు
23న ఆస్ట్రేలియాతో ఢీ

కేప్‌టౌన్: సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సమిష్టిగా రాణించింది. ఓపెనర్ స్మృతి మంధాన అర్థ శతకం(87)తో చెలరేగడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 155పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ జట్టు 8.2ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 52పరుగులు చేయగా.. భారీ వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచిపోయింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై భారత్ ఐదు పరుగులు తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో భారతజట్టు ఎలాంటి సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా సెమీస్‌కు చేరింది. 23న జరిగే సెమీస్‌లో భారత్ పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడనుంది.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు షెఫాల వర్మ-స్మృతి మంధాన కలిసి తొలి వికెట్‌కు 62పరుగులు జతచేశారు. షఫాలీ వర్మ(24) రాణించినా.. హర్మన్‌ప్రీత్ కౌర్ (13) విఫలమైంది. ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన(87) మరో అర్ధసెంచరీతో కదం తొక్కింది. కారా ముర్రే ఓవర్‌లో సిక్సర్‌తో అర్ధశతకం పూర్తి చేసుకున్న మంధాన.. 40 బంతుల్లో 5ఫోర్లు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీని పూర్తి చేసుకుంది. ఈ ప్రపంచకప్‌లో మంధానకు ఇది రెండో అర్ధసెంచరీ. నాలుగో వికెట్‌కు జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి 28 పరుగులు జోడించింది. అంతకుముందు షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌తోనూ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పింది. రెండో వికెట్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్, మంధాన 50పరుగులు జోడించారు. మొదటి వికెట్‌కు షఫాలీ వర్మతో కలిసి 62 పరుగులు జోడించింది. ఐర్లాండ్ బౌలర్లలో డెలానీ మూడు వికెట్లు, ఒర్లా ప్రెండెర్‌గాస్ట్ రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మంధానకు లభించింది.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మంధాన

హర్మన్ రికార్డు
150 టి20ల్లో 3వేల పరుగులు

భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వ్యక్తిగత స్కోర్ 8పరుగుల వద్ద టి20ల్లో 3వేల మార్క్‌ను అందుకుంది. కేవలం 150టి20ల్లోనే ఈ మార్క్‌ను అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా హర్మన్ రికార్డు నెలకొల్పింది. అలాగే మరో 14 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడితే మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డును హర్మన్ బ్రేక్ చేయనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ 2009నుంచి టి20 ప్రపంచకప్ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహిస్తోంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)హంటర్ (బి)డెలానీ 24, స్మృతి మంధాన (సి)లెవీస్ (బి)ఒర్లా 87, హర్మన్‌ప్రీత్ (సి)ఒర్లా (బి)లారా డెలానీ 13, రీచా ఘోష్ (సి)లూవీస్ (బి)లారా డెలానీ 0, రోడ్రిగ్స్ (స్టంప్)వాల్డ్రాన్ (బి)అర్లేనా 19, దీప్తి శర్మ (సి)జియోజినో (బి)ఒర్లా 0, పూజా వస్త్రాకర్ (నాటౌట్) 2, అదనం 10. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 155పరుగులు. **వికెట్ల పతనం:** 1/62, 2/114, 3/115, 4/143, 5/143, 6/155 బౌలింగ్: ఓర్లా 4-0-22-2, జార్జినా 3-0-27-0, అర్లైనా కెల్లే 4-0-28-1, లీచ్ పాల్ 3-0-27-0, కారా ముర్రె 2-0-16-0, లారా డెలెనె 4-0-23-3.

ఐర్లాండ్ మహిళల ఇన్నింగ్స్: హంటర్ (రనౌట్)రోడ్రిగ్స్/రీచా 1, లెవీస్ (నాటౌట్) 32, ఓర్లా (బి)రేణుకా సింగ్ 0, లారా డెలనీ (నాటౌట్) 17, అదనం 4. (8.2 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 54పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/1 **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-10-1, పూజ వస్త్రాకర్ 2.2-0-14-0, శిఖా పాండే 2-0-14-0, దీప్తి శర్మ 1-0-11-0, రాజేశ్వరి గైక్వాడ్ 1-0-5-0

మిక్స్‌డ్ జట్టుకు స్వర్ణం
ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



కైరో: ఐఎస్-ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో భారత్‌కు తొలిరోజు రెండు స్వర్ణ పతకాలు లభించాయి. మిక్స్‌డ్ ఎయిర్ పిస్టల్, మిక్స్‌డ్ ఎయిర్ రైఫిల్ విభాగాల్లో ఒక్కో స్వర్ణ పతకం దక్కింది. సోమవారం జరిగిన 10మీ. ఎయిర్ రైఫిల్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు ఈ పతకాలు దక్కాయి. నితిన్‌రాజ్-రుద్రాక్షలతో కూడిన మిక్స్‌డ్ బృందం 635.8పాయింట్లతో పోడియంలో అగ్రస్థానంలో నిలిచింది. ఇక స్వర్ణ పతక పోటీలో భారతజోడీ హంగేరికి చెందిన ఈస్టర్ డేనీస్-ఇస్త్వాన్ పెనీలపై 16-6 పాయింట్లతో గెలిచారు. భారత్‌కే చెందిన రీథమ్ సంఘ్వాన్-వరుణ్ థోమర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో(583-17) అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతక పోటీలో 16-10తో సెర్బియా బృందంపై విజయం సాధించి రెండో స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది.

టెస్ట్ సిరీస్‌కు హేజిల్‌వుడ్ దూరం
ఆసీస్‌కు పయనమైన కమిన్స్
ఫిట్‌నెట్ సాధించిన గ్రీన్, స్టార్క్

ముంబయి: ఆసీస్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యక్తిగత కారణాలతో ఆసీస్‌కు పయనం కాగా.. స్టార్ పేసర్ హేజిల్ వుడ్ టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. గాయం నుంచి అతను పూర్తిగా కోలుకోకపోవడమే ఇందుకు కారణం. అలాగే అష్టన్ అగర్, మ్యాట్ రెన్‌షా కూడా బయలుదేరి వెళ్తున్నారని ఆస్ట్రేలియా మీడియా సోమవారం పేర్కొంది. కెప్టెన్ పాట్ కమిన్స్ కుటుంబసభ్యుల్లో ఒకరికి అనారోగ్యం కారణంగా అతడు స్వదేశానికి వస్తున్నాడని వెల్లడించింది. అదే నిజమైతే మూడోటెస్ట్‌కు స్టీవ్ స్మిత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. తొలి రెండు టెస్టులకు దూరమైన ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్, ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఇండోర్ టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే.. టెస్టు జట్టులో మార్పుల గురించి ఆసీస్ మేనేజ్‌మెంట్ బుధవారం అధికారికంగా వెల్లడించనుంది. నాగ్‌పూర్ టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఢిల్లీ టెస్టులో 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఓడిన సంగతి తెలిసిందే.

విండ్ సర్ఫింగ్
ఆసియా క్రీడలకు ఐశ్వర్య అర్హత



ముంబయి: ఆర్ఎస్:ఎక్స్ విండ్‌సర్ఫింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన ఐశ్వర్య గణేష్ ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మూడు సెలెక్షన్ ఆర్ఎస్:ఎక్స్(పడవ) ట్రయల్స్‌లో ఐశ్వర్య మూడు స్వర్ణ పతకాలతో అదరగొట్టింది. దీంతో ఐశ్వర్య 600పాయింట్లు సాధించింది. దీంతో విండ్ సర్ఫింగ్‌లో భారత్ తరపున ఓ మహిళా యాచర్ ఆసియా క్రీడలకు అర్హత సాధించడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ.. 19వ ఆసియా క్రీడల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించగలుగుతున్నందుకు సంతోషంగా ఉందని, దీంతో తన కల సాకారమైందని' ఐశ్వర్య పేర్కొంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68